జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 30 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 83 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: చతుర్దశి - 12:00:58 వరకు నక్షత్రంవిశాఖ - 13:21:16 వరకు కరణంవణిజ - 12:00:58 వరకు, విష్టి - 25:08:22 వరకు పక్షంశుక్ల యోగంశివ - 29:23:49 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## మీ నియంత్రణకు అంగీకరించం

- హర్మూజ్ పై ఇరాన్- ఒమన్ పెత్తనం
- ఒమాన్‌కు ట్రంప్ గట్టి హెచ్చరికలు

న్యూఢిల్లీ,మే29(ప్రజాజ్యోతి): అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి హర్మూజ్ జలసంధి చుట్టూ తీవ్రరూపం దాల్చాయి. ప్రపంచ చము రు, గ్యాస్ రవాణాకు అత్యంత కీలకమైన

మిగతా1 2లో..

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

వారు కూడా మనుషులే అని గుర్తించాలి

లైంగిక వృత్తిలో ఉన్నవారికి ఆధార్ కార్డులు ఇవ్వాలి

సుప్రీం కోర్టు స్పష్టీకరణ.. పోలీసులకు ఆదేశాలు జారీ

న్యూఢిల్లీ,మే29(ప్రజాజ్యోతి): స్వచ్ఛందంగా ప్రాస్టిట్యూషన్‌ను ఎంచుకోవడం, మానవ అక్రమ రవాణా బారినపడి సెక్స్ వర్క్‌లోకి దిగడం మధ్య స్పష్టమైన తేడా ఉందని సుప్రీంకోర్టు స్పష్టం

మిగతా 2లో..




## నీట్ పేపర్ లీక్ బాధ్యత
# ఎవరిది?

- యూపిపిఎస్‌సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థుల ఆందోళనకు బాధ్యులెవరు?
- నీట్ పేపర్ లీక్‌పై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ,మే29(ప్రజాజ్యోతి): నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది. అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా

మిగతా 12లో..

## నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

వారిని కఠినంగా శిక్షించి తీరుతాం

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ,మే29(ప్రజాజ్యోతి): నీట్ యూజీ పేపర్ లీక్ వ్యవహారంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీట్ యూజీ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని.. ప్రశ్నపత్రం నిజంగానే లీక్ అయిందని అంగీకరించారు. పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న

మిగతా 12లో..

## ఎస్ఐఆర్ వల్ల సమస్యలు
# ఎదురుకావచ్చు

- దళితులు, మహిళల ఓట్లు పోయే అవకాశం
- పార్టీ కేడర్ సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి
- మంత్రులు పార్టీ కార్యక్రమాలకై పని చేయాలి
- ప్రతి 10 రోజులకు ఒక రోజు కేటాయించాలి
- క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను కలవాలి
- నేనుకూడా పార్టీ కార్యకర్తలను కలుస్తా..
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- సెక్యులర్ ఓటు బ్యాంకు తొలగించే కుట్ర
- ఎస్ఐఆర్ పేరిట బీజేపీ ప్రభుత్వం దగా
- సర్‌పై సమాలోచన కోసమే సమావేశం
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపణ
- గాంధీభవన్‌లో సర్‌పై అవగాహన తరగతులు
- సమావేశానికి హాజరైన మీనాక్షి నటరాజన్

హైదరాబాద్,మే29(ప్రజాజ్యోతి): ఎస్ఐఆర్‌పై అందరూ అవగహన పెంచుకోవడం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న సర్‌పై పార్టీ నాయకులకు అవగాహన కల్పించేందుకు గాంధీభవన్‌లో పీసీసీ రాజకీయ వ్యవహారాలు, అడ్వైజరీ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్ల సామాన్యులు, పేదలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు రాబోతున్నాయో నాయకులు గుర్తించడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్.. లంబాడీలు ,ఆదివాసీలు, వలస కార్మికులకు పెద్ద సమస్య కావచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. కొన్ని నియోజకవర్గాల్లో చాలా మంది వలస పోయారని తెలిపారు. మహిళలకు కూడా ఎస్ఐఆర్ వల్ల సమస్యలు ఎదురుకావచ్చు నన్నారు. ఎస్ఐఆర్ వల్ల

మిగతా 2లో..



### మాజీమంత్రి గాదె వెంకట్‌రెడ్డి కన్నుమూత

హైదరాబాద్,మే29(ప్రజాజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ

మిగతా 2లో..

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఫలితాలు



హైదరాబాద్,మే29(ప్రజాజ్యోతి): తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. మాసాబ్ ట్యాంక్ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్, ప్రొఫెసర్ బాలక్రిష్ణ రెడ్డి ఫలితాలను విడుదల

మిగతా 2లో..

## ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఫిర్యాదు

హైదరాబాద్,మే29(ప్రజాజ్యోతి): మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఇటీవల చేపట్టిన ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో నిర్వహించిన ఔట్‌సోర్సింగ్ నియామకాలు పూర్తిగా నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని తెలిపారు. రోస్టర్ రిజర్వేషన్ విధానం పాటించకుండా పత్రిక ప్రకటనలు

మిగతా 2లో..

## సిద్ధరామయ్య రాజీనామాకు
# ఆమోదం

- ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని కోరిన గవర్నర్
- జూన్ 1 లేదా 4న డీకే ప్రమాణస్వీకారం!!
- అధిష్టానం ముందు సిద్ధ సరికొత్త ప్రతిపాదన!
- ప్రభుత్వం, పార్టీకి సమన్వయ కమిటీకి సిఫార్సు



న్యూఢిల్లీ,మే29(ప్రజాజ్యోతి): కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఆమోదించారు. దీంతో ప్రస్తుత మంత్రిమండలి కూడా తక్షణమే రద్దయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని సిద్దరామయ్యను గవర్నర్ కోరారు. మరోవైపు కర్ణాటకలో నాయకత్వ మార్పు ప్రక్రియను పూర్తి చేసేందుకు అధిష్ఠానం వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ గురువారం రాత్రే ఢిల్లీ చేరుకున్నారు. ఆయన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా సమావేశమై కొత్త ప్రభుత్వంపై చర్చిస్తున్నారు. మరోవైపు సిద్ధరామయ్య ప్రయాణిస్తున్న విమానం ప్రతికూల వాతావరణం వల్ల మొదట జైపూర్‌కు మళ్లించారు. దీంతో కాస్త ఆలస్యంగా ఆయన కూడా ఢిల్లీ చేరుకుని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీకి సిద్ధమయ్యారు. కొత్త ముఖ్యమంత్రి ఎంపికపై ఢిల్లీ విమానాశ్రయంలో మీడియా అడిగిన

మిగతా 12లో..

## తెలంగాణలో అంచనాను మించి
# ధాన్యం ఉత్పత్తి

- అయిన ఆచివరి గింజ వరకు కొంటూనే ఉన్నాం
- తడిసిన ధాన్యం సైతం కొని రైతులను ఆదుకున్నాం
- అదనపు కొనుగోళ్లకు రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం
- మీడియా సమావేశంలో మంత్రులు వెల్లడి




హైదరాబాద్,మే29(ప్రజాజ్యోతి): దేశంలోనే అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఈ మాట కేంద్రమే చెప్పిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొనుగోళ్ల కంటే ఇప్పుడు ఎక్కువ కొంటున్నాం అన్నారు. సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు పాటిస్తూ చెప్పిన దానికంటే అదనంగా కొనుగోలు చేశాం అన్నారు. . దీనికోసం రూ.16,479 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో చివరి గింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత మాది అని ఉత్తమ్ తెలిపారు. ధాన్యం సేకరణకు క్షేత్రస్థాయిలో 13వేల వాహనాలు అందుబాటులో

మిగతా 12లో..

## 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణం

గృహనిర్మాణ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ

హైదరాబాద్,మే29(ప్రజాజ్యోతి): 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణానికి గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ ఎ÷–లాట్లు నిర్మించేందుకు హౌసింగ్ బోర్డుకు

మిగతా 2లో..



# సంపాదకీయం

## కాలంతో పోరాడలేక చతికిల పడ్డ కమ్యూనిస్టులు

కేరళ సిఎంగా ఉండగానే పినరయ్ విజయ్‌పై ఆరోపణలు వచ్చాయి. కూతురికి లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వ ధనం దుర్వినియోగం చేశారన్న అభియోగాలు వచ్చాయి. ఇందులో ఆనాటి నుంచే కేసు నడుస్తోంది. తాజాగా ఇప్పుడు ఇడి రంగంలోకి దిగడంతో ఇది కాంగ్రెస్, బిజెపిల కుట్ర అని, లెఫ్ట్ పార్టీని దెబ్బతీసే కుయుక్తి అంటూ విమర్శలు చేస్తున్నారు. చాలా విచిత్రంగా ఈ రెండు పార్టీలు కలుస్తాయా అన్నది కమ్యూనిస్టులే చెప్పాలి. మరో విషయమేమంటే ఎన్నికల సందర్భంగా రాహుల్ తన ప్రచారంలో బిజెపి లెఫ్ట్‌తో కుమ్మక్కయిందని ఆరోపించారు. కాంగ్రెస్‌– బిజెపి రెండూ కూడబలుక్కొని కేరళంలో సిపిఎం ప్రతిష్టను దెబ్బతీయటానికి బరి తెగించాయని విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇడి నోటీసులు ఇవ్వటంతో వ్యవహారం మొదలైంది. దేశంలో ప్రతిపక్ష పార్టీలపైనా, నాయకులపైనా అవినీతి ఆరోపణలు గుప్పించడం, ఆ తరువాత తన గుప్పిట్లో పెట్టుకున్న దర్యాప్తు సంస్థల చేత దాడులు చేయించడం కేంద్రంలోని మోడీ–షా ప్రభుత్వం చాలాకాలంగా అనుసరిస్తున్న విధానం అని దాదాపు అన్ని పార్టీలు చేస్తున్న ఆరోపణలే. ఢిల్లీలో అరవింద్ కేజీవ్రాల్, జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌ల మీద సాగించిన దాష్టీకం, ఇందులో భాగమని సిపిఎం ఆరోపణ. అవినీతి పంకిలం అంటించి రాజకీయ లబ్ధి పొందాలనే బిజెపి కుట్రపూరిత వ్యూహం అత్యంత దిగజారుడుతనానికి నిదర్శనంగా ఇప్పుడు సిపిఎం ఆరోపిస్తోంది. కేరళంలో అధికారం కోల్పోయాక సిపిఎం బహుశా కనుమరుగైనట్లుగానే భావించాలి. కేరళంలో కొంత మిణుకుమిణుకుమంటున్నా,దేశంలోని అనేక రాష్ట్రాల్లో అసలు ఉనికి లేకుండా పోయింది. ముఖ్యంగా కమ్యూనిస్టులు నేలవిడిచి సాము చేయడం, పడికట్టు సిద్ధాంతాల నుంచి బయటపడక పోవడం, గతంలో లాగా పోరాటలకు దూరంగా ఉండడం వంటివన్నీ వారిని తుడిచిపెట్టేలా చేశాయి. కేరళంలో విజయన్ కుమార్తె నిర్వహణలోని సంస్థ అందించిన సేవల నిమిత్తం పొందిన ప్రతిఫలాన్ని వివాదాస్పదం చేసి, మనీ లాండరింగ్ సెక్షన్లు బనాయించిందన్నది సిపిఎం ఆరోపణగా ఉంది. రాహుల్ గాంధీ ఇంకో రెండడుగులు ముందుకేసి, పినరయి విజయన్‌ను ఎందుకు అరెస్టు చేయరంటూ ప్రశ్నించాడట. కేరళంలో అధికారంలోకి వచ్చిన మరు క్షణం నుంచి ఒకపక్క కాంగ్రెస్, మరోపక్క సంఘ్ పరివార్ శక్తులూ సిపిఎంపై దాడులకు తెగబడుతున్నాయన్న వాదనను సిపిఎం తెరపైకి తెచ్చింది. విజయన్ ఇంటిపై కుట్రపూరిత దాడుల గురించి తెలిసిన వెంటనే దేశమంతా వెల్లువెత్తిన నిరసనలే ఎర్రజెండా పట్ల ప్రజల నమ్మకానికి నిదర్శనం అంటోంది. నిజానికి ఈ కేసు చాలా చిన్నది. దీనిని కోర్టులో తేల్చుకోవచ్చు. కానీ అలా చేయడం లేదు. లెఫ్ట్ రాజకీయాలకు వస్తే బెంగాల్లో 35 ఏళ్లపాటు అధికారంలో ఉండి చేసిందేమీ లేదు. కేరళలోనూ ప ఎద్దగా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. తరిపురలోనూ అలాగే చేశారు. అందుకే ప్రజలు వీరిని ఇంటికి పంపించారు. ఈ దెబ్బతో దేశంలో ఇక లెఫ్ట్ పార్టీలకు కాలం చెల్లినట్లే. అభివృద్ధి చెందిన దేశాల్లో, అంటే సంపన్న, వలసవాద, పారిశ్రామిక దేశాల్లో కమ్యూనిస్టు భావజాలం అంతగా విస్తరించలేకపోయింది. వలస విముక్తి ఉద్యమాలు జోరందుకున్న లేదా నవస్వతంత్ర దేశా ల్లో మాత్రం దండిగా మార్మోగింది. అలాంటి దేశాల్లో భారత్ మొదటి వరుసలో ఉంటుంది. సాంప్రదాయిక భావజాల ప్రతినిధి అయిన ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించిన 1925లోనే కమ్యూనిస్టు పార్టీ ఊపిరిపోసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కుటుంబానికి చెందిన బీజేపీ తన అధికారాన్ని పటిష్టపరచుకుంటున్న తరుణంలో కమ్యూనిస్టులు కనుమరుగైపోతుండటం ఓ వైచిత్రి. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1951 –52 నాటి తొలి ఎన్నికల్లో వారు గణనీయమైన విజయాలు సాధించారు. నల్గొండ నుంచి కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను మించిన మెజారిటీ సాధించడం గురించి అప్పట్లో గొప్ప గా చెప్పుకొన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో కమ్యూనిస్టుల పలుకుబడి అడుగంటిన సూచనలు కనిపిస్తు న్నాయి. సు మారు 50 ఏండ్లలో ఏ రాష్ట్రంలోనూ కమ్యూనిస్టు ప్రభుత్వం లేని పరిస్థితి వచ్చింది. కేరళలో పినరయి విజయన్ ప్రభుత్వ ఓటమి కీలక పరిణామమే. దీంతో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టుల శకం అంతరించినట్టేననే వ్యాఖ్యానాలు వినిపిస్తుండటం గమనార్హం. ఒకప్పుడు కమ్యూనిస్టులు ప్రజల కోసం ఉద్యమాలు చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేకుండ పోయాయి. కేరళ తర్వాత బెంగాల్, త్రిపుర ఇలా మొత్తం మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలు సుదీర్ఘకాలం కొనసాగాయి. కానీ ఇప్పుడదంతా గత వైభవం. మారిన పరిస్థితుల్లో దానిని తిరిగి రాబట్టుకోవడం అంత సులభం కాదని మాత్రం చెప్పవచ్చు. కేంద్రంలో కాంగ్రెస్ ఆధిపత్యం వీగిపోయి, సంకీర్ణ ప్రభుత్వాల కాలంలో కమ్యూనిస్టులు హస్తినలో మంత్రి పదవులూ చేపట్టారు. ఓ దశలో కమ్యూనిస్టు సీనియర్ నేత జ్యోతిబసును ప్రధాని పదవి చేపట్టే అవకాశమూ తలుపు తట్టింది. అంతటి ఉన్నతస్థితి నుంచి, నేడు ఏమాత్రం ప్రాముఖ్యం లేని స్థాయికి కమ్యూనిస్టులు పడిపోయారు. కేరళంలో తమను ఓడించిన కాంగ్రెస్‌తో తెలంగాణలో అంటకాగడం, ఒకటి రెండు స్థానాల కోసం వెంపర్లాడటం వారి దైన్యాన్ని కండ్లకు కడుతున్నది. భారత్‌లో పార్లమెంటరీ పంథాలో వెళ్లిన కమ్యూనిస్టులు కనుమరుగవుతుంటే, మరోవైపు సాయుధ పోరాటాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టులు కగార్ ధాటికి నేలకొరుగుతున్నారు. కమ్యూనిస్టుల 'చారిత్రిక తప్పిదాలు', ప్రజల్లో పెరిగిన వినిమయతత్వం అందుకు దారితీశాయి అనేది అక్షరసత్యం. ప్రజలిప్పుడు డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టటం గురించి తప్ప విప్లవాలు, ఉద్యమాల గురించి ఎక్కువగా ఆలోచించటం లేదు. కాలం చెల్లిన వ్యూహాలు, ఎత్తుగడలూ కమ్యూనిస్టుల మహాప్రస్థానానికి బ్రేకులు వేశాయి. మొత్తంగా ఇప్పుడు కమ్యూనిస్టుల భవిష్యత్ ఏంటన్నది కాలమే చెప్పాలి. పినరయ్ విజయ్ లాంటి వారు కూతురుకు మేలు చేయడం కోసం అవినీతి బురద తొక్కడం కూడా కాల వైచిత్రమే.

## ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అక్రమాలు

మొదటిపేజీ తరువాయి..

సరైన విధంగా ఇవ్వకుండా అర్హులైన నిరుద్యోగులకు అవకాశం లేకుండా నియామకాలు చేపట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశంపై యూనివర్సిటీ వీసీ,రిజిస్ట్రార్‌కు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించకపోవడంతో ఉన్నత విద్యా మండలి చైర్మన్‌ను కలిసి పూర్తి వివరాలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘ నాయకుడు వాడపల్లి నవీన్ మాట్లాడుతూ.. గతంలో నవీన్ మిట్టల్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సమయంలో కూడా 33 మంది డైలీ వేజ్ ఉద్యోగులను రోస్టర్ రిజర్వేషన్, పత్రిక ప్రకటనలు లేకుండా అక్రమంగా నియమించారని తెలిపారు. ప్రస్తుతం చేపట్టిన నియామకాలలో కూడా నిరుద్యోగుల వద్ద లక్షల రూపాయలు వసూలు చేసి 100కు పైగా అక్రమ నియామకాలు జరిగాయని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఆ ఏజెన్సీకి యూనివర్సిటీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనులు ఇవ్వకుండా బ్లాక్‌లిస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రస్తుతం జరిగిన నియామకాలను పూర్తిగా రద్దు చేసి, తిరిగి పారదర్శకంగా నోటిఫికేషన్ విడుదల చేసి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించి నాణ్యత కలిగిన విద్యావంతులను ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు పోలగొని శివ, రాజేష్, యశ్వంత్, రామ్, జితేందర్, సంజీవ, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## 'క్యూర్' పరిధిలో అఫర్డబుల్ ప్లాట్ల నిర్మాణం

మొదటిపేజీ తరువాయి..

తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దిగువ, మధ్య తరగతి కోసం లక్ష ప్లాట్లు నిర్మించనుండగా.. పైలట్ ప్రాజెక్టు కింద 12 వేల ప్లాట్ల నిర్మాణానికి హౌసింగ్ బోర్డుకు అనుమతి ఇచ్చారు. ఎల్‌ఐజీ ప్లాట్లకు భూమి యూడీఎస్, రూ.5 లక్షల సబ్సిడీ ఇవ్వనున్నారు. హౌసింగ్ బోర్డు, దిల్, రాజీవ్ స్వగృహ, ప్రభుత్వ భూముల్లో ప్లాట్ల నిర్మాణం చేపట్టనున్నారు.



## ఎస్ఐఆర్ వల్ల సమస్యలు
# ఎదురుకావచ్చు

మొదటిపేజీ తరువాయి..

దళితులు, మైనార్టీలు, మహిళల ఓట్లు పోయే అవకాశం ఉందని ఆందోళన చెందారు. ఎస్ఐఆర్ వల్ల తలెత్తే సమస్యలకు పరిష్కారంపైన సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా సీఎం సూచించారు. బూత్ ఎన్‌రోలర్ల సహాయంతో గతంలో 90 రోజుల్లో 45 లక్షల డిజిటల్ మెంబర్‌షిప్ చేయించామని వివరించారు. ఎక్కువ సభ్యత్వం నమోదు చేయించిన వారికి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో సన్మానం చేయించామన్నారు.

గతంలో కాంగ్రెస్ సభ్యత్వంలో కీలక పాత్ర పోషించిన ఎన్‌రోలర్స్‌ను ఎస్ఐఆర్ విషయంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందన్నారు. డిజిటల్ మెంబర్‌షిప్ కోసం ప్రతి నియోజకవర్గంలో ఒక ఇన్చార్జిను నియమించి నిరంతరం పర్యవేక్షించామని చెప్పారు. ఎస్ఐఆర్ కోసం 119 నియోజకవర్గాలు, 17 లోక్‌సభ ముందుకు వెళ్లాలని సూచించారు. నాయకులు క్షేత్రస్థాయికి వెళ్తేనే.. కార్యకర్తలు బూత్ స్థాయికి వెళ్తారని వివరించారు. రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్సీలకు హైదరాబాద్ పరిధిలో బాధ్యతలు అప్పగించాలని పార్టీలోని ముఖ్య నేతలకు సూచించారు. హైదరాబాద్ నగర పరిధిలోని 15 నియోజకవర్గాల్లో ఎస్ఐఆర్ పైన అసెంబ్లీల వారీగా సమావేశాలు పెట్టాల్సిన అవశ్యకతను ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. ఎస్ఐఆర్‌పైన మహిళా కాంగ్రెస్ తరపున క్లస్టర్ల వారీగా సమావేశాలు నిర్వహించాలని పార్టీలోని నేతలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోందని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోందని.. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు బీజేపీ యత్నిస్తోందని మహేశ్‌కుమార్‌గౌడ్



నియోజకవర్గాలకు ఇన్చార్జిలను నియమించాల్సి ఉందని వివరించారు. అసెంబ్లీ ఇంచార్జిలు తప్పనిసరిగా నియోజకవర్గాల్లో ఉండాల్సిందేనని చెప్పారు. ఇంచార్జిలు కరెక్ట్‌గా పనిచేస్తే ఒక్క ఓటు కూడా డిలీట్ కాకుండా చూడొచ్చునని నేతలకు సీఎం రేవంత్ వివరించారు.

ఇన్చార్జి మంత్రులు ప్రతి 10 రోజులకు ఒక రోజు పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయికి వెళ్లి కార్యకర్తలను ఇన్చార్జి మంత్రులు కలవాల్సి ఉందని వివరించారు. తాను కూడా 10 రోజులకోసారి క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తలను కలుస్తానని చెప్పారు. నెలలో మూడు రోజులు పార్టీ కార్యకర్తల కోసం సమయం ఇస్తానని పేర్కొన్నారు. పార్టీ కోసం పనిచేయాల్సిందే నేతలకు స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు.. ప్రతి ఒక్కరు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందేనని.. చివరకు తనతోపాటు ఎవరికి మినహాయింపు లేదని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. మాజీ పీసీసీ అధ్యక్షుల సలహాలు, సూచనలు తీసుకోవాలని నేతలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. దాదాపుగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేశామని వివరించారు. పార్టీ తరుపున ఇప్పుడు వేలాది మంది సర్పంచ్‌లు ఉన్నారని.. అలాగే మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు కూడా ఉన్నారని పేర్కొన్నారు. వలస పోయిన వారి ఓట్లు పోకుండా జాగ్రత్త పడాల్సి ఉందన్నారు. పార్టీ నాయకులంతా సమన్వయంతో ఆరోపించారు. బంగాల్ తర్వాత పంజాబ్, తెలంగాణనే బీజేపీ టార్గెట్ చేసిందని.. కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెక్యులర్ ఓటు బ్యాంకును తొలగించే కుట్ర జరుగుతోంది. పార్టీ సంస్థాగత నిర్మాణం, సర్‌పై సమాలోచన కోసమే సమావేశం ఏర్పాటు చేశాం. సంఘటన సృజన్ అభియాన్‌లో భాగంగా నూతన డీసీసీల ఎంపిక జరిగింది. కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు బీజేపీ యత్నిస్తోంది. బంగాల్ తర్వాత పంజాబ్, తెలంగాణనే బీజేపీ లక్ష్యమని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరిట సెక్యులర్ ఓట్లను తొలగించే ప్రక్రియ చాలా పకడ్బందీగా చేస్తోందని ఆరోపించారు. బంగాల్‌లో సుమారు 93 లక్షల ఓట్లను తొలగించారని తెలిపారు. అయితే అప్పీల్ చేసుకొనేందుకు కేవలం 30 లక్షల మందికి మాత్రమే అవకాశం ఇచ్చారన్నారు. సుమారు 62 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి నిర్దాక్షిణ్యంగా తొలగించాలని ఆరోపించారు. దీంతో ఆ రాష్ట్రంలో ప్రభుత్వమే మారిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని పార్టీ సభ్యులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓట్లకు కాపాడుకొనేందుకు ప్రత్యేక శిక్షణ శిబిరాలను ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు పూర్తి అవగాహన ఉన్న వారిని నియమించినట్లు తెలిపారు. నేతలందరూ ఇందులో భాగస్వామ్యం కావాలని కోరారు.

## గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

- ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ
- అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య
- సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్,మే29(ప్రజాజ్యోతి): తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, నాన్–సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు



ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఓఖఅ గ్రూప్‌కు 21,447, ఃతిఖఅ గ్రూప్‌కు 17,400, ఓఇఅ, అఇఅ, ఊఇఅ గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. ఃూష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్–1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు.

## తెలంగాణ ఈసెట్ ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి..

చేశారు. ఈసెట్‌లో మొత్తం 16,726 మంది అభ్యర్థులు (93.60 శాతం) క్వాలిఫై అయ్యారు. ఈ సందర్భంగా బాలక్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేస్తామని చెప్పారు. జూలై మొదటి వారంలో క్లాసెస్ ప్రారంభం అవుతాయని తెలిపారు. ఫీజులు గత ఏడాది మాదిరిగానే ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం, ఈసెట్ కన్వీనర్ ప్రొ.చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు ఎదురుచూస్తున్న విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. మే 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్ష ఫలితాలు, విద్యార్థుల మార్కుల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా(పాలిటెక్నిక్), బీఎస్సీ(మ్యాథమెటిక్స్) పూర్తిచేసిన విద్యార్థులకు నేరుగా బీటెక్, బీఫార్మసీ కోర్సుల ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. ఫలితాల విడుదల నేపథ్యంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరాలనుకునే విద్యార్థుల్లో సందడి నెలకొంది. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## మీ నియంత్రణకు అంగీకరించం

మొదటిపేజీ తరువాయి..

జలసంధిపై టోల్ వ్యవస్థ అమలు చేసే ప్రయత్నాలను అమెరికా తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యంగా ఇరాన్‌తో కలిసి ఒమన్ అలాంటి చర్యలకు సహకరిస్తే కఠిన ఆంక్షలు తప్పవని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ స్పష్టం చేశారు. స్కాట్ బెసెంట్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో చేసిన పోస్టులో హర్మూజ్ జలసంధిపై టోల్ విధించే ప్రయత్నాలను అమెరికా ఏమాత్రం సహించదన్నారు. ఈ ప్రక్రియలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వామ్యం అయ్యే వ్యక్తులు, సంస్థలు, దేశాలపై ట్రెజరీ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ముఖ్యంగా ఒమన్ ఈ విషయాన్ని గమనించాలని స్పష్టం చేశారు. అంతర్జాతీయ వాణిజ్య రవాణాను ఇరాన్ అడ్డుకునే ప్రయత్నాలను అన్ని దేశాలు తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒమాన్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. హర్మూజ్ జలసంధిపై ఇరాన్– ఒమన్ నియంత్రణకు అమెరికా అంగీకరించదని స్పష్టం చేశారు. ఆ వ్యూహాత్మక జలమార్గంపై జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల మధ్య అమెరికా ట్రెజరీ శాఖ ఇరాన్‌కు చెందిన పర్షియన్ గల్ఫ్ స్ట్రైట్ అథారిటీపై ఆంక్షలు విధించింది. ఈ సంస్థ ద్వారా హర్మూజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలపై అక్రమ టోల్లు వసూలు చేస్తున్నారని అమెరికా ఆరోపిస్తోంది. ఈ నిధులు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కు మళ్లుతున్నాయని తెలిపింది. దీంతో స్ట్రైట్ అథారిటీ స్పెషల్ డిజిగ్నేటెడ్ నేషనల్స్ జాబితాలో చేర్చింది. అమెరికా ప్రకారం, హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలకు అనుమతులు ఇవ్వడం, రవాణా నియంత్రణ పేరుతో ఇరాన్ కొత్త వ్యవస్థను రూపొందించింది. అయితే ఇది భద్రత కంటే వాణిజ్య నౌకలపై ఒత్తిడి తీసుకురావడానికేనని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. మరోవైపు ఇరాన్ మాత్రం సముద్ర భద్రత, పర్యావరణ పరిరక్షణ కోసం కొన్ని ఫీజులు సహజమేనని చెబుతోంది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ మాట్లాడుతూ, హర్మూజ్ జలసంధిలో నౌకల సురక్షిత ప్రయాణం కోసం ఒమాన్‌తో కలిసి ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నామని చెప్పారు. దీనిని బాధ్యతాయుత చర్యగా అభివర్ణించారు. ఇటీవలే పర్షియన్ గల్ఫ్ స్ట్రైట్ అథారిటీ అధికారిక ఎక్స్ ఖాతా ప్రారంభమైందని ఇరాన్ ప్రకటించింది. అయితే అమెరికా ఒత్తిడి నేపథ్యంలో ఒమాన్ వెనక్కి తగ్గినట్లు కనిపిస్తోంది. స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ, ఒమాన్ రాయబారితో తాను మాట్లాడినట్లు తెలిపారు. హోర్ముజ్ జలసంధిపై టోల్ విధించే ఎలాంటి ప్రణాళికలు లేవని ఒమాన్ హామీ ఇచ్చిందన్నారు. అమెరికాతో తమకు 200 ఏళ్లుగా మంచి సంబంధాలు ఉన్నాయని, వాటిని కొనసాగించాలని ఒమాన్ కోరుకుంటోందని చెప్పారు. ఒమాన్ వ్యక్తులు లేదా ఆర్థిక సంస్థలు ఆంక్షలకు గురయ్యే పరిస్థితి రావద్దని కూడా ఒమాన్ భావిస్తున్నట్లు వెల్లడించారు.

## సెక్స్ వర్కర్లపై దాడులు సరికాదు

మొదటిపేజీ తరువాయి..

చేసింది. ఇష్టపూర్వకంగా సెక్స్ వర్క్ చేసే వయోజనులను వేధించవద్దని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. సెక్స్ వర్కర్లకు చట్టపరంగా సమాన రక్షణ ఉండాలని పేర్కొంది. దాడుల సమయంలో వారి గుర్తింపును వెల్లడించొద్దని మీడియాకు కూడా వార్నింగ్ ఇచ్చింది. దేశంలో మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమగ్ర మార్గదర్శకాలు జారీ చేసింది. స్వచ్ఛందంగా సెక్స్ వర్క్‌ను ఎంచుకున్న వారికి, మానవ అక్రమ రవాణా ముఠాల బారిన పడి ఈ రొంపిలో కూరుకుపోయిన బాధితులకు మధ్య తేడాను గుర్తించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సొంత ఇష్టంతో సెక్స్ వర్క్ నిర్వహించే వయోజనులపై దాడులు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి ఒక్కరికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేవలం లైంగిక వృత్తిలో తల్లి ఉందనే ఏకైక కారణంతో ఆమె నుంచి బిడ్డను బలవంతంగా వేరు చేయలేరని కూడా సుప్రీం కోర్టు పేర్కొంది. రెస్క్యూ ఆపరేషన్ల సమయంలో సెక్స్ వర్కర్ల ఫోటోలు, వీడియోలు ప్రసారం చేయడం నేరమని పేర్కొంది. నివాస ధ్రువీకరణ పత్రాలు లేకపోయినప్పటికీ సెక్స్ వర్కర్లందరికీ తక్షణమే ఆధార్ కార్డులు జారీ చేయాలని కూడా ఆదేశించింది.

**CHANGE OF NAME**

I, Asma Anjum, W/o. Syed Javed Ali Age: 45 years Occ: House Hold R/o. H.No.1-1-47/23/255/7/2, New Kumar Wada, Adilabad Town, Dist. Adilabad (TG) changed my name post marriage to **SYEDA ASMA ANJUM** W/o. Syed Javed Ali (New name) for all relevant purposes.

## కుమారి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- రైతుల పంటల దంపింగ్ కోసం విజయలక్ష్మి జిన్నింగ్ కేటాయింపు
- అన్నదాతలు అధైర్యపడొద్దు.. బీఆర్ఎస్ అండగా ఉంటుంది



**నేరడిగొండ, మే 29 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కుమారి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో పంటల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులను ఆయన పలకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల పట్ల ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆయన స్వతహాగా చొరవ తీసుకుని, సాత్ నంబర్‌లో గల 'విజయలక్ష్మి జిన్నింగ్' యజమానితో మాట్లాడారు. కుమారి సొసైటీ పరిధిలోని రైతుల పంటలను దంపింగ్ చేసుకోవడానికి సదరు జిన్నింగును కేటాయించేలా చర్యలు తీసుకున్నారు. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ పార్టీ తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ చిత్రు, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నాయకులు రవీందర్ రెడ్డి, కుమారి ప్యాక్స్ చైర్మన్ మందుల రమేష్, ప్రతాప్, సుజీల్, కౌఠ సర్పంచ్ స్వామి, శ్రీధర్ రెడ్డి, బాధ వెంకటరమణ,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ ప్రారంభం...





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఒకటి నుంచి పదవ తరగతి చదువుతున్న అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలలకు తెలుగు ఇంగ్లీష్ ఉర్దూ మరాఠీ హిందీ మీడియం లకు సంబంధించినటువంటి ఉచిత పాఠ్య పుస్తకాలు రాష్ట్రం నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్నవి... జిల్లాకు కావలసిన 480700 పాఠ్యపుస్తకాలలో 445170 పాఠ్య పుస్తకాలు జిల్లా కేంద్రానికి చేరుకున్నట్టు అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీ) మరియు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాజేశ్వర్ గారు తెలిపారు... పాఠశాలల యొక్క పునః ప్రారంభ తేదీ గడువు సమీపిస్తున్నందున నేటి నుంచి పాఠ్యపుస్తకాల సరఫరా ప్రారంభించినట్టు వారు తెలిపారు. రీఓపెనింగ్ లోగా ప్రతి పాఠశాలలోని ప్రతి విద్యార్థి చేతిలో పాఠ్యపుస్తకం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు వారు పేర్కొన్నారు. ఇట్టి పాఠ్య పుస్తకాలకు సీరియల్ నెంబర్ ఉంటున్నశీదున ఆ సీరియల్ నెంబర్ రాసుకొని విద్యార్థులకు సరఫరా చేయవలసిందిగా వారు ఆదేశించారు. పత్తి పుస్తకాలను నిలువ చేయుటకు పాఠశాలల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్ గౌడ్ గారు, సాంఘిక సంక్షేమ పాఠశాలల సమన్వయకర్త ప్రిన్సిపల్ లలిత కుమారి, టెక్స్ట్ బుక్స్ మేనేజర్ నూటెంకి సత్యనారాయణ, డి.ఇ.ఓ.సి.సి.రాజేశ్వర్,సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు...

## స్వయం సహాయ సంఘాలకు రుణాల పంపిణీ

**జన్నారం, మే 29 (ప్రజాజ్యోతి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళ వారోత్సవాల కార్యక్రమంలో జన్నారం మండల కేంద్రంలోని వసుంధర మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం రోజున మహిళా సంఘాలకు 10 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను, ప్యాడి కమిషన్ ఎనిమిది లక్షలు, ర్యామ్ ల్యాంబ్ 4 లక్షలు, పిఎంఎఫ్ఎంఈ రెండు లక్షల రూపాయల చెక్కులను అధికారులు,రాజకీయ నాయకులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందు నాయక్, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసివుల్లా, నాయకులు ముజాఫర్ అలీ ఖాన్, గుర్రం మోహన్ రెడ్డి, సయ్యద్ ఇసాక్ టౌన్ ప్రెసిడెంట్ మంద రాజేష్, మండల సమాఖ్య అధ్యక్షులు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట

- స్వయం సహాయక సంఘాల మహిళలకు భారీ ఆర్థిక చేయూత
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు





**మంచిర్యాల, మే 29 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ స్వయం సహాయక సంఘాల మహిళలకు భారీ ఆర్థిక చేయూత అందిస్తోందని మంచిర్యాల ఎమ్మెల్యే ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక మహిళ వారోత్సవాలు' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన స్వయం సహాయక సంఘాలకు 53 కోట్ల 10 లక్షల 75 వేల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళల అభివృద్ధే గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసానికి పునాది అని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక బలం చేకూర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు స్థానిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఏర్పాటు ద్వారా మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు .మంచిర్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, హాజీపూర్, లక్సెట్టిపేట్, దండేపల్లి మండలాల మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి







- ఖానాపూర్, కడెం మండలలో విస్తృత తనిఖీలు చేసిన
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ఖానాపూర్ మే 29 (ప్రజా జ్యోతి) :** జిల్లాలో ధాన్యం అన్లోడింగ్, కొనుగోలు ప్రక్రియను అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఖానాపూర్, కడెం మండలాల్లోని పలు రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ రైస్ మిల్లుతో పాటు కడెం మండలంలోని లక్ష్మీ అన్నపూర్ణ రైస్ మిల్లు, నవాబ్‌పేట్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్లోడ్ చేసిన ధాన్యం వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ స్థలం, రోజువారీ సగటు అన్లోడింగ్ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులను, మిల్లు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మిల్లుకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా అవసరమైన మేరకు ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. స్థానిక అధికారులు రైస్ మిల్లుల వద్ద అన్లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, లారీలు త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితి తలెత్తకుండా, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు. మిల్లుల తనిఖీ అనంతరం కడెం మండల తహసిల్దార్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్‌ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం పరిమాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన ప్రక్రియను కూడా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఈ తనిఖీలు, సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహశీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ, అరుణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలుల్లో చెల్లా చెదరై

- విరిగిన చెట్లను తొలగించి
- రహదారుల మరమ్మత్తులు
- ఎంపీవో చిక్యాల రత్నాకర్ రావు వెల్లడి







**ఖానాపూర్ మే 29(ప్రజా జ్యోతి) :**
ఇటీవల కురిసిన ఈదురు గాలులతో గ్రామాల్లో చెల్లా చెదురై విరిగిన చెట్లు గృహ నివాసాల పై గల రేకులు కొట్టుకుపోయి రహదారులు దిగ్బంధమై ఇబ్బందులకు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవయ్యారు ఈ విషయమై మండల స్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీలు చేసి రహదారులను మరమ్మతు చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చెట్లను ఎగిరిపోయిన రేకులను తొలగించారు మండలంలోని దిలార్పూర్ గోదల్ పంపు తో పాటు తదితర గ్రామాల్లో ఎంపీ ఓ చిక్యాల రత్నాకర్ రావు ఆధ్వర్యంలో ప్రస్తుతం పనులను పూర్తి చేశారు ఇందులో వైకుంత దామాలపై గల రేకులు 300 మీటర్లకు పైగా కొట్టుకుపోయాయని నివాస గృహాల్లో సైతం పలుచోట్ల పాక్షికంగా పూర్తిగా కూలిపోయిన వివరాలను సేకరించి మండల పరిషత్ అధికారి రాధా మండల తహసిల్దార్ సుజాతలతో పాటు ఆర్డిఓ జిల్లా కలెక్టర్లకు నివేదికను సమర్పించుతున్నట్లు రత్నాకర్ తెలిపారు.

## జిల్లా రైతులను పగలే దోచుకుంటున్న ఎరువుల వ్యాపారులు, ఫర్టిలైజర్ యజమానులు

- అక్రమాలను తెలిసి తెలియనట్టుగా వదిలే యడం సిగ్గుచేటు, చోద్యం చూస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు
- ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పక్కనపెట్టి అధిక ధరలు వసూలు చేస్తూ రైతులరక్తాన్ని పీల్చుతున్న వ్యాపారులు
- రైతుల ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకొని వేల రూపాయలు అదనంగా వసూలు చేసి దోపిడీకి పాల్పడుతున్న ఎరువుల వ్యాపారులు
- పత్తి గింజల విక్రయాల్లో భారీ స్థాయిలో గోల్మాల్ నాసిరకం గింజలను బ్రాండెడ్ కంపెనీల పేర్లతో రైతులకు బలవంతంగా మోపుతున్న ఫర్టిలైజర్ షాప్ యజమానులు - రైతులకు బిల్లులు ఇవ్వకుండా అక్రమంగా అమ్మకాలు చేస్తున్న అధికారులు మాత్రం వ్యాపారస్తులతో కుమ్మక్కై నోరు మూసుకొని ఉండడం విడ్డూరం - రైతులకు కాపాడాల్సిన అధికారులు,వ్యాపారస్తు లకు కాపలదారులుగా మారడం దారుణం - రైతులు ఎన్నిసార్లు ఫిర్యా దు చేసిన స్పందించని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు తమ బాధ్య తలను పూర్తిగా మర్చి పోయారు.
- ఇప్పటికైనా జిల్లా వ్యవ సాయ శాఖ అధికారులు స్పందించి ప్రత్యేక తనిఖీ లు నిర్వహించి అధిక ధరలకు ఎరువులు అమ్ముతు న్న దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలి - నకిలీ పత్తి గింజల విక్రయదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- సిపిఎం పార్టీ సిర్పూర్ (టి) నియోజకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్



**మే 28, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) నియోజకవర్గంలోని సిర్పూర్ కాగజ్ నగర్ మండలంలో పత్రిక ప్రకటన విడుదల చేసిన అనంతరం సిపిఎం పార్టీ సిర్పూర్(టి) నియో జకవర్గ కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ చరవాణి పై తెలిపిన వివరాల ప్రకారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎరువుల వ్యాపారులు, ఫర్టిలైజర్ షాప్ యజమానులు రైతులను పగలే దోచుకుంటున్నారని అన్నారు.వీరి అక్రమాలను తెలిసి తెలియనట్టుగా వదిలేయడం సిగ్గుచేటని తీవ్రస్థాయిలో మండి పడ్డారు. సిపిఎం పార్టీ సిర్పూర్ (టి) నియో నియోజకవర్గం కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ..ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పక్కన పెట్టి ఇష్టా రాజ్యంగా అధిక ధరలకు ఎరువులు అమ్ముతూ రైతుల రక్తాన్ని పీల్చుతు న్న వ్యాపారులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూ రంగా ఉందని అన్నారు. ఇది అధికారుల వైఫల్యానికి నిదర్శనమని అన్నా రు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే, వ్యాపారులు మాత్రం రైతు ల ఆర్థిక పరిస్థితులను ఆసరాగా చేసుకొని వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా పత్తి గింజల విక్రయాలలో భారీ స్థాయి లో గోల్మాల్ జరుగుతోంద ని అన్నారు. నాసిరకం నకిలీ గింజలను బ్రాండెడ్ కంపెనీల పేర్లతో రైతులపై బలవంతంగా మోపుతు న్నారని అన్నారు.బిల్లులు ఇవ్వకుండా అక్రమంగా అమ్మకాలు నిర్వహిస్తున్నా అధికారులు మాత్రం వ్యాపారులతో కుమ్మక్కై నోరు మూసుకొని కూర్చో వడం అనుమానాలకు తావిస్తోందని తీవ్ర ఆరోప ణలు చేశారు.రైతులు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించకుండా తమ బాధ్యతలను పూర్తిగా మరిచిపోయారని అన్నారు. రైతులను కాపాడాల్సిన అధికారులు వ్యాపారులకు కాపలాదా రులుగా మారడం దారుణ మని విమర్శించారు. వెంటనే జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్న దుకాణాల లైసెన్సులు రద్దు చేయా లని, నకిలీ పత్తి గింజల విక్రయదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయా లని డిమాండ్ చేశారు. రైతులను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే సిపిఎం పార్టీ రైతులతో కలిసి భారీ ఆందోళనలు, ముమ్మరం చేస్తామని తెలిపారు. నిరసనలు, ధర్నాలు, కార్యాలయాల ముట్టడులు నిర్వహిస్తా మని హెచ్చరించారు. రైతుల కష్టార్జితాన్ని దోచు కుంటున్న వ్యాపారులు, వారికి అండగా నిలుస్తున్న అధికారులను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో క్షమించరని అన్నారు.

## నామ్కేవాస్ కార్పొరేషన్! కానరాని అధికారులు!




**మంచిర్యాలరూరల్ మే 29 (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించి సంవత్సరం కాలం పూర్తియినా, ప్రజలకు అందాల్సిన ప్రాథమిక పారిశుద్ధ్య సేవలు మాత్రం ఇంకా అందని ద్రాక్షగానే మిగిలిపోయాయని స్థానికులు మండిపడుతున్నారు. "కార్పొరేషన్"అనే పేరు మాత్రమే మారిందిగానీ, ప్రజల సమస్యలు మాత్రం యథాతథంగానే కొనసాగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నస్పూర్ ప్రాంతంలోని పలు డివిజన్లలో శానిటేషన్ పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని ప్రజల నుండి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ విధులు నిర్వర్తించిన సానిటరీ ఇన్‌స్పెక్టర్ కొంతకాలం ముందు రామగుండం కార్పొరేషన్ ప్రమోషన్ పై బదిలీ అయ్యారు,ఇప్పటివరకు మరో అధికారిని నియమించకపోవడం మున్సిపల్ శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు విమర్శిస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెత్త పేరుకుపోవడం,కాలువలు శుభ్రం కాకపోవడం,దోమల సమస్య పెరగడం వంటి ఇబ్బందులు తీవ్రరూపం దాల్చుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక శానిటేషన్ బాధ్యతలను సానిటరీ అధికారికి కాకుండా ఎన్విరాన్మెంట్ ఇంజనీర్‌కు అప్పగించడం మరింత వివాదాస్పదంగా మారింది. శానిటేషన్‌పై అవగాహనా లోపం,పర్యవేక్షణ నైపుణ్యం కలిగిన అధికారులను నియమించకుండా ఇతర విభాగాల అధికారులతో బాధ్యతలు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో పనితీరు పూర్తిగా దెబ్బతింటోందని విమర్శలు వినిపిస్తున్నాయి.దీంతో నస్పూర్ పరిధిలోని అనేక డివిజన్లలో పారిశుద్ధ్యం పూర్తిగా గాడి తప్పిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ఏర్పడిన పాలకవర్గానికి దాదాపు నాలుగు నెలలు పూర్తవుతున్నప్పటికీ,ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా గాలిలో కలిసిపోతుండగా, కార్పొరేషన్ పరిపాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ముఖ్యంగా మంచిర్యాలలో భారీగా పెరుగుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు,షాపింగ్ మాల్స్,వాణిజ్య సముదాయాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి.ఫుడ్ లైసెన్సులు,ట్రేడ్ లైసెన్సులు జారీ చేసే సమయంలో మున్సిపల్ కార్పొరేషన్ భారీగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ,వాటి వద్ద శానిటేషన్ ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న విషయంపై అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదని స్థానికులు అంటున్నారు. చాలా హోటళ్ల వెనుక చెత్త కుప్పలు,డ్రైనేజీ సమస్యలు, దుర్వాసన వంటి ఇబ్బందులు ప్రజలను వేధిస్తున్నాయని తెలుపుతున్నారు. శానిటేషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.లక్షకు పైగా జనాభా కలిగిన మంచిర్యాల వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణంగా ఎదుగుతున్నప్పటికీ, ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో కార్పొరేషన్ పూర్తిగా విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు.ప్రధాన రహదారుల వెంట చెత్త పేరుకుపోవడం,కాలువలు మూసుకుపోవడం, దోమల సమస్య పెరగడం వంటి సమస్యలు ప్రజల ఆరోగ్యానికే ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజల నుంచి పన్నులు వసూలు చేయడంలో చురుకుదనం చూపుతున్న మున్సిపల్ కార్పొరేషన్,సేవలు అందించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు మండిపడుతున్నారు.అభివృద్ధి పేరుతో భారీ ప్రకటనలు చేస్తున్న అధికారులు,నేలమట్టంలోని సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.ఈ పరిస్థితులపై వెంటనే స్పందించి శానిటేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలని,ఖాళీగా ఉన్న సానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని,హోటళ్లతో పాటుగా వాణిజ్య సముదాయాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ పాలకవర్గంతో పాటు స్థానిక ఎమ్మెల్యే సైతం జోక్యం చేసుకుని ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## మోకాళ్లపై నిలబడి రైతన్నల నిరసన

మద్దతు తెలిపిన బిఆర్ఎస్ నాయకులు



**సొనాల, మే 29 (ప్రజాజ్యోతి) :** సొనాల మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో నాయకులు, అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతూ... ధాన్యం తరలించడంలో అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లాల్లోకి ధాన్యం తీసుకువచ్చి నెలరోజులు గడుస్తున్న ధాన్యాన్ని తరలించడంలో మాత్రం విఫలమవుతున్నారన్నారు. మొన్నటి వరకు గన్ని సంచుల కొరత, తూకం అయ్యాక లారీల కొరత, ఇప్పుడేమో బార్దాన్ల కొరతతో రైతులు అవస్థలు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు మాత్రం ఫోటోలకు ఫోజులు ఇస్తూ ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని మేకపోతూ గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. మరో వారం రోజుల్లో ఋతుపవనాలు రానున్నాయని పొలాల్లో దుక్కులకు గతి లేదని రాబోవు ఖరీఫ్ సీజన్లో రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- హెల్త్ ఆఫీసర్ పవర్ రవీందర్



**నేరడిగొండ, మే 29 (ప్రజాజ్యోతి) :** నేరడిగొండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నెలవారీ సెక్టార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (హెచ్ ఈ ఓ) పవార్ రవీందర్, హెల్త్ సూపర్వైజర్ స్వర్ణలత మేడం ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మండలంలో ప్రజారోగ్య పరిరక్షణకు, సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. ఈ సందర్భంగా గ్రామాల నుంచి సేకరించిన 10 క్షయ వ్యాధి (టిబి) అనుమానిత శ్లేష్మ,తెమడ నమూనాలను పరీక్షల నిమిత్తం సేకరించారు. వైద్య సేవలను ప్రజలకు మరింత చెంతకు చేర్చడంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం



**జన్నారం, మే 29 (ప్రజాజ్యోతి) :** ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ యువజన నాయకుడు బందెల ప్రేమ్ సాగర్ అన్నారు.శుక్రవారం రోజున పొనకల్ పాక్స్ కార్యాలయంలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడి దాన్యం కుప్పలు అక్కడే వానలు తడిసి ముద్దవుతున్న పట్టించుకోవడంలేదని, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెలన్నర దాటుతున్న రకరకాల కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తుందని, ఒకవైపు ఎండలు మరోవైపు వానలతో కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతలు తీరని గోసపడుతున్నారని, ధాన్యం కొనుగోలులో జాప్యం, సంచులు కొరత, రవాణా ఇబ్బందులతో అన్నదాతలు రోడ్డున పడ్డారని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేసి గోదాములకు తరలించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దుమల్ల ఎల్లయ్య, కొండపల్లి మహేష్, ఐలవేణి రవి, కొండకూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన గల్ఫ్ కార్మికులు



**జన్నారం, మే 29 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామానికి చెందిన ఒడ్డేటి మల్లేష్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే మృతి చెందాడు. మృతుడు మల్లేష్ నిరుపేద కుటుంబానికి చెందిన వాడు కావడంతో రోటి గూడ గల్ఫ్ కార్మికుడు ఉప్పు సురేష్ గ్రామ గల్ఫ్ కార్మికుల దృష్టికి తీసుకువెళ్లగా వారు రూపాయలు 32,500 జమ చేసి శుక్రవారం రోజున మృతుడి భార్యకు అందజేశారు. గల్ఫ్ కార్మికులు మాట్లాడుతూ, ఒడ్డేటి మల్లేష్ కుటుంబానికి సహాయం చేయడం తమ సామాజిక బాధ్యతలో భాగమని, ఇలాంటి సహాయ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు. ఈ సామాజిక సేవా కార్యక్రమంలో రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపకుడు సేపూరి గోపాల్, అధ్యక్షుడు ఉప్పు తిరుపతి, ఉపాధ్యక్షుడు పులిశెట్టి లవన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలాజీ శ్రీనివాస్ ,అకౌంటెంట్ ఉప్పు మల్లేశం, ప్రచార కార్యదర్శి ఒడ్డేటి రమేష్, సలహాదారు ఉప్పు కిరణ్, ఉప్పు నరేష్ ,పులిశెట్టి భగత్ ,తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం..

- రైతులు అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి జూపల్లి

వనపర్తి ప్రతినిధి, మే 29 (ప్రజాజ్యోతి):
అకాల వర్షాలతో ధాన్యం తడిసిన రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి గోదాములకు తరలిస్తుందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం



జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి వీపనగండ్ల, కేతేపల్లి శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన మంత్రి, తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. లారీల కొరతపై రైతులు ఫిర్యాదు చేయగా, ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను వెంటనే అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్ మిల్లులకు తరలించాలని సూచించిన మంత్రి, తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు.
అనంతరం మెహ్రూన్ ఇండస్ట్రీస్‌ను సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియపై సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వినోద్ కుమార్, గోవర్ధన్ సాగర్, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్

## తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

మహబూబ్‌నగర్, మే 29 ( ప్రజా జ్యోతి బ్యూరో )
జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలో మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి




ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించి, వారి తల్లిదండ్రులతో కలిసి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. చిన్న వయస్సులో వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన చర్యలు, ప్రాణాపాయ పరిస్థితులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని తెలిపారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధారణ, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి అంశాలను కచ్చితంగా అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో మహబూబ్‌నగర్‌ను "ఆక్సిడెంట్ ఫ్రీ మహబూబ్‌నగర్"గా తీర్చిదిద్దేందుకు పోలీసులు కృషి చేస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి సహా ఇతర ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బడిబాట పాటల సీడీ ఆవిష్కరణ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, మే 29 ( ప్రజా జ్యోతి బ్యూరో )
ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వనరులు, నాణ్యమైన విద్య, విద్యార్థుల నమోదు, విద్యా ప్రమాణాలు, సౌకర్యాలు, జీవన నైపుణ్యాలతో కూడిన బోధన, స్పోర్ట్స్, గేమ్స్, యోగ తదితర అంశాలను ప్రతిబింబించేలా



ప్రభుత్వ ఉపాధ్యాయుడు తిరుమల నాగేంద్ర కుమార్ రచించిన "బడిబాట" పాటల సీడీని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు. అలాగే ఇంచార్జి జిల్లా విద్యాధికారి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి. మురళీకృష్ణ, పాట రచయిత ప్రభుత్వ ఉపాధ్యాయుడు తిరుమల నాగేంద్ర కుమార్, రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.ఎన్. విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల కలలు, విద్యా ప్రాధాన్యతను అద్భుతంగా ప్రతిబింబించేలా ఈ పాట రూపొందించబడిందన్నారు. ప్రతి పాఠశాలలో ఈ పాటను విద్యార్థులకు వినిపిస్తూ ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన పెంచాలని సూచించారు.
విద్యార్థుల నమోదును మరింత వేగవంతం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పాట రచయిత తిరుమల నాగేంద్ర కుమార్‌ను కలెక్టర్ అభినందించారు.

## మఖ్తల్ నూతన ఎస్ఐగా పి.రాజు యాదవ్ బాధ్యతలు

-శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తా: ఎస్ఐ రాజు యాదవ్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, మే 29 (ప్రజా జ్యోతి):
మఖ్తల్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానని ఎస్ ఐ పి.రాజు యాదవ్ తెలిపారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా ఎస్ఐ పి.రాజు యాదవ్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు మఖ్తల్ ఎస్సైగా 2 సంవత్సరాల 4 నెలలు విధులు నిర్వహించిన వై.భాగ్యలక్ష్మి రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి (వీఆర్)కు బదిలీ కాగా దామరగిద్ద ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పి.రాజు యాదవ్ బదిలీపై మఖ్తల్ కు నూతన ఎస్ఐగా రావడం జరిగింది. మఖ్తల్ ఎస్సైగా చేరక ముందు ఎస్సై పి.రాజు యాదవ్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ కు పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలియజేసి, మండల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని



సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై పి.రాజు యాదవ్ మాట్లాడుతూ మఖ్తల్ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.
ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు.
ప్రజలు ఎలాంటి సమస్యలైనా నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు.
గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు,మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు.
మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు.

## ప్రతి కుటుంబానికి అండగా ఉంటా

- వనపర్తిలో పూరి గుడిసెలు లేకుండా చేస్తాం

- మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మే 29 (ప్రజాజ్యోతి):
వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి, ముఖ్యంగా మహిళలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.





ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వనపర్తి లోని దాచే లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ.3.40 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కులు, ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం, ఆరోగ్య భీమా రూ.10 లక్షలకు పెంపు, ఉచిత సన్నబియ్యం పంపిణీ వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 500 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఐటీ టవర్ అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటికే 546 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, ప్లాట్లు లేని పేదలకు మరో వెయ్యి ప్లాట్ల ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో ఒక్క పూరి గుడిసె కూడా లేకుండా పక్కా ఇళ్లు నిర్మించడమే లక్ష్యమన్నారు. మహిళలకు డీజిల్ బంక్, సూపర్ మార్కెట్, రైస్ మిల్లు, గోదాముల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, బీమా సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్ మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు, మహిళలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మే 29(ప్రజా జ్యోతి ప్రతినిధి):
ఓటరు జాబితాను ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా పారదర్శకంగా రూపొందించేందుకు ఓటరు జాబితా సమగ్ర సవరణ




(ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.శుక్రవారం హైదరాబాద్ నుంచి అదనపు ముఖ్య ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను ముద్రించి ప్రకటించాల్సి ఉందన్నారు.ఎన్యూమరేషన్ ఫారమ్‌లను ఓటర్లకు అందజేసిన అనంతరం ప్రతి ఇంటిని సంబంధిత బీఎల్‌వోలు మూడుసార్లు సందర్శించి,ఓటర్ల డిక్లరేషన్‌ను సేకరించాలని సూచించారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం చేపట్టాలని పేర్కొన్నారు.
గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,సరిగా పనిచేయని బీఎల్‌వోల స్థానంలో కొత్తవారిని నియమించాలని ఆదేశించారు.సంబంధిత మండలాల తహసీల్దారులు తమ పరిధిలోని సూపర్వైజర్లు, బీఎల్‌వోలతో సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.జోగులాంబ గద్వాల జిల్లాలో ఇప్పటివరకు 78.52 శాతం మ్యాపింగ్ పూర్తయిందని,గద్వాల మండలంలో మ్యాపింగ్ శాతం తక్కువగా ఉన్నందున పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు,వివిధ మండలాల తహసీల్దారులు,సంబంధిత అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

: అధికారులకు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాలు

మహబూబ్‌నగర్, మే 29 ( ప్రజా జ్యోతి బ్యూరో )
జూన్ 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి ఆమె దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించే జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి పోలీస్ భద్రత, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీటి వసతి, నీడ కోసం టెంట్ల ఏర్పాటు తదితర అంశాలను పరస్పర సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖ అధికారులను ఆదేశించారు. జాతీయ పతాక ఆవిష్కరణకు ముందు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ సమీపంలోని అమరవీరుల స్థూపం వద్ద గార్డ్ ఆఫ్ హానర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థూపం అలంకరణతో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులు, ప్రజలకు తాగునీరు, నీడ సదుపాయాలు కల్పించాలని, వైద్య శాఖ



అధికారులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించే ప్రత్యేక "ప్రజాపాలన స్టాల్" ఏర్పాటు చేయాలని తెలిపారు. అదనంగా డీఆర్‌డీఓ, జిల్లా సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖల ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉద్యానవన శాఖ అధికారులు కలెక్టర్ కార్యాలయ పరిసరాల్లోని లాన్‌లు, చెట్లను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయం, స్వతంత్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరణలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, అడిషనల్ ఎస్పీ సురేష్ కుమార్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి: కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

గద్వాల మే 29 (ప్రజా జ్యోతి):
జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అన్నారు. ముఖ్య అతిథులు,ప్రజా ప్రతినిధులు,అధికారులు,ఆహ్వానితులందరికీ



ఆహ్వానాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వేడుకలకు హాజరయ్యే ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందస్తుగా మాక్‌డ్రిల్ నిర్వహించడంతో పాటు పోలీసు గౌరవ వందనం,బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు,పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు.నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వేడుకల్లో ప్రతిబింబించేలా చూడాలని సూచించారు.వివిధ శాఖల సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని, ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ఉత్తమ శాఖలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక అమలులో విశేష కృషి చేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు,అధికారులకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.జిల్లా,మండల,గ్రామ స్థాయిలో కూడా వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలంకరణతో అలంకరించి పండుగ వాతావరణం తీసుకురావాలని సూచించారు.జిల్లా కేంద్రంలోని స్మృతి వనం, పాత బస్టాండ్ వద్ద ఉన్న తెలంగాణ పోరాట యోధుల విగ్రహాలు,సభాస్థలి వేదికలను పూలతో అందంగా అలంకరించాలని అధికారులకు సూచించారు.వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు నర్సింగరావు,మధుమోహన్,ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏఓ భూపాల్ రెడ్డి,తహసీల్దార్ హరికృష్ణ,మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న ఎస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డికి పోలీస్ సిబ్బంది బాధతో వీడ్కోలు

ఘనంగా నూతన ఎస్ఐ పి.రాజు యాదవ్ కు స్వాగతం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, మే 29 (ప్రజా జ్యోతి):
మఖ్తల్ మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉండి పోలీస్ సిబ్బందికి ఒక టీం లీడర్ గా ఎస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డి వ్యవహరిస్తూ విధులు నిర్వహించి ఎలాంటి మచ్చ లేకుండా ఒక పోలీస్ అధికారి బదిలీపై వెళ్లడం అంటే అది గర్వించదగ్గ విషయమని సిఐ రాంలాల్ రాథోడ్ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ మండల పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా వై.భాగ్యలక్ష్మి రెడ్డి రెండు సంవత్సరాల నాలుగు నెలల పాటు విధులు నిర్వహించి జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయిన సందర్భంగా పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన ఎస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డి వీడ్కోలు సమావేశానికి సిఐ రాంలాల్ రాథోడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ రాంలాల్ రాథోడ్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డిని శాలువా పూలమాలతో సత్కరించి చిరు కానుక అందజేశారు. అనంతరం మఖ్తల్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు పాత్రికేయ మిత్రులు,రాజకీయ ప్రముఖులు,స్థానికులు ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డిని శాలువాలతో సన్మానించడం జరిగింది. అదేవిధంగా నూతనంగా మఖ్తల్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పి.రాజు యాదవ్ ను సిఐ రాంలాల్ రాథోడ్ తోపాటు స్థానికులు



పాత్రికేయులు శాలువాలతో సన్మానించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐ రాంలాల్ రాథోడ్ మాట్లాడుతూ గడిచిన సంవత్సరాలా నాలుగు నెలల పాటు మఖ్తల్ ఎస్సైగా వై.భాగ్యలక్ష్మి రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసికట్టుగా ఉండి సిబ్బందికి ఒక టీం లీడర్ గా వ్యవహరిస్తూ కేవలం ఒక అధికారి మాత్రమే కాకుండా ఈ పోలీస్ స్టేషన్‌కు ఒక బలమైన స్తంభం పనిచేస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో చూపిన చొరవ, నేరాల నియంత్రణలో వారు అనుసరించిన వ్యూహాలు ఎంతో అభినందనీయం ఆయన కొనియాడారు. ముఖ్యంగా పండుగలు, బందోబస్తులు, లా అండ్ ఆర్డర్ సమస్యలు వచ్చినప్పుడు వారు నాతో రాత్రి పగలు పనిచేసి మఖ్తల్ పోలీస్ పోలీసులంటే అది ఒక టీం అనుకునేలా మన డిపార్ట్‌మెంట్‌కు ఎంతో పేరు తీసుకువచ్చేందుకు పాటుపడ్డారన్నారు. పోలీస్ ఉద్యోగంలో బదిలీలు, పదవీ విరమణలు సహజం కానీ అందువల్ల ఒక చోటు నుండి మరొక చోటుకు వెళ్లడం అనేది మన బాధ్యతలను, సేవలను విస్తరించుకోవడమే అన్నారు. ఇక్కడి నుండి బదిలీపై వెళ్లిన మీరు రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డికి సీఐ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మఖ్తల్ పోలీస్ సిబ్బంది మాట్లాడుతూ ఉన్న రెండు సంవత్సరాల వ్యవధిలో తమలో ఒక కుటుంబ సభ్యుడిగా ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి ఉండి విధుల పట్ల సలహాలు సూచనలు చేస్తూ ఎస్సై అనే భావన లేకుండా తమతో కలిసికట్టుగా పనిచేసిన ఎస్సై ఈరోజు బదిలీపై వెళ్లడం ఎంతో బాధాకరంగా ఉందని పాటల రూపంలో వారి బాధను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ ఎస్సై రేవతి, ఏఎస్ఐ శంకరయ్య, హెడ్ కానిస్టేబుల్స్ బలరాం, తిరుపతయ్య, చంద్రశేఖర్, కానిస్టేబుల్స్ నరేష్, మనోహర్,మహేష్, అశోక్, శ్రీకాంత్, అరుణ్, భాను, హర్ష, చైతన్య, భారతి, హోంగార్డ్స్ లక్ష్మణ్, శ్రీనివాస్, శ్రీను, శ్రీహరి గౌడ్, రాజకీయ ప్రముఖులు పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బాలల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

అగ్రంపహాడ్‌లో అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**ఆత్మకూరు, మే 29 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బాలల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం అగ్రంపహాడ్ గ్రామంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అంగన్ వాడి భవనాన్ని ప్రారంభించారు. ఆత్మకూరు మండలం ఆగ్రంపహాడ్ గ్రామంలో మహిళా శక్తి వారోత్సవాల సందర్భంగా అంగన్వాడి భవనాన్ని హనుమకొండ జిల్లా అధ్యక్షులు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది అంగన్వాడీలని, గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, బాలల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల విద్యాభివృద్ధికి, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రీ ప్రైమరీ స్కూల్ లు ఏర్పాటు చేయబోతున్నామని, డైట్ చార్జెస్ పెంపు, అత్యాధునిక విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళల సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. పిల్లలకు పోషకాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య సేవలు అందించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ స్టాఫ్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## 26వ డివిజన్‌లో స్థానిక కౌన్సిలర్ ఆధ్వర్యంలో ముమ్మరంగా ఆసరా పెన్షన్ల ఆధార్ అథెంటికేషన్, కార్యక్రమం



**నర్సంపేట, మే 29 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని 26వ డివిజన్ శివనగర్ జయశ్రీ టాకీస్ వెనుక గల జి.ఆర్. గార్డెన్‌లో శుక్రవారం ఆసరా పెన్షన్ లబ్ధిదారుల ఫేస్ రికగ్నైజేషన్ (ముఖ గుర్తింపు), ఆధార్ అథెంటికేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఒంటరి మహిళలు,బిడి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డ్ ఆఫీసర్, బిల్ కలెక్టర్లు ప్రత్యేక యాప్ ద్వారా లబ్ధిదారుల ఫోటోలను సేకరించి, ఆధార్ వివరాలను అనుసంధానం చేశారు. ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు జరిగిన ఈ ప్రక్రియలో లబ్ధిదారులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డులతో పాల్గొని బయోమెట్రిక్, ఫేస్ అథెంటికేషన్ పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆసరా పెన్షన్లు క్రమం తప్పకుండా అకౌంట్లలో జమ కావాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ అథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ఈ ప్రక్రియ పూర్తి కాని పక్షంలో పెన్షన్ నిలిపివేయబడే అవకాశం ఉన్నందున డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణంలోని ప్రతి ఒక్కరు జూన్ 15 వ తేదీ లోగా సద్వినియోగం చేసుకోవాలని కోరినారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డ్ ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు డివిజన్ ముఖ్య నాయకులు వేల్పుల కన్నయ్య, నాడెం రామకృష్ణ, గుండబోయిన శివకోటి, దోనాల రవి, ఇరగదిన్ల పెంచలయ్య, మార్త శంకర్, మండల సత్యనారాయణ, మండల సంతోష్,సంఘ రమేష్, ప్రజలు పాల్గొన్నారు.

## సీతానాగారంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**హసన్‌పర్తి, మే 29(ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రహదారిని వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన ఈ రహదారి నిర్మాణం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని శాసనసభ్యుడు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో మౌలిక సదుపాయాల కల్పన కీలకమని పేర్కొన్నారు. నాణ్యమైన రహదారుల నిర్మాణంతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయం, విద్య, వైద్య సేవలకు చేరువ కావడం సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీటి సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వెల్లడించారు.సీతానాగారం గ్రామంలో నిర్మించిన ఈ రహదారి గ్రామాభివృద్ధికి మరో ముందడుగుగా నిలుస్తుందని శాసనసభ్యుడు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం, అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రహదారి ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్తులు శాసనసభ్యుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూకట్ల సునీత-రమేష్, ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు తంగెళ్లపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సరస్వతి నది అంత్య పుష్కరాల్లో పాల్గొన్న విశాఖ శారదా పీఠాధిపతి

**శివతత్వమే సృష్టి మూలం : స్వరూపానందేంద్ర సరస్వతి**



**హనుమకొండ మే 29 (ప్రజా జ్యోతి) :** శుక్రవారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానం మేరకు కాలేశ్వర ముక్తేశ్వర స్వామి సన్నిధిలో జరుగుతున్న సరస్వతి నది అంత్య పుష్కరాల్లో విశాఖ శారదా పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పుణ్యస్నానాలు ఆచరించారు.అనంతరం వరంగల్ నగరానికి విచ్చేసిన స్వామివారిని మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు నివాసం వద్ద మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్, వద్దిరాజు గణేష్, తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ, వేయి స్తంభాల దేవాలయం కార్యనిర్వాహణ అధికారి డి. అనిల్ కుమార్, వేద పండితులు నాగిళ్ల షణ్ముఖ శర్మ, గంగు మణికంఠ శర్మ, శ్రీవత్సవాచార్యులు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని ఆశీర్వాదాలు పొందారు.ఈ సందర్భంగా స్వామివారు భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ చరాచర జగత్తులో కనబడే ప్రతి దానీ శివుని ఆజ్ఞ మేరకే సంభవిస్తుందని పేర్కొన్నారు.శివుడు సకల సృష్టికి ఆదిపురుషుడని, ఆయన ఆజ్ఞ లేకుండా గాలి కదలదని, వర్షం కురవదని, నిప్పు వెలగదని తెలిపారు. శ్రీ మహావిష్ణువు కూడా పరమశివుని అనుగ్రహంతోనే అవతారాలు ధరించారని, ఈ విషయాన్ని బ్రహ్మాండ పురాణం సహా అనేక పురాణాలు పేర్కొన్నాయని వివరించారు.శివ పరమాత్మ కోపరూపమే కాళికాదేవి, యుద్ధరూపమే దుర్గాదేవి, భోగరూపమే భవానీదేవి అని చెప్పారు.ధర్మరక్షణ, దుష్టశిక్షణ కోసం విష్ణువు అవతారాలు ధరించాడని శ్రీహరి స్వయంగా పేర్కొన్నాడని తెలిపారు.భిన్నత్వంలో ఏకత్వమే సృష్టి మూలస్వరూపమని, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, భూమి, నీరు అన్నీ ఒకే పరమ తత్వమైన "శివం" నుండి ఉద్భవించాయని పేర్కొన్నారు.ప్రతి జీవిలోనూ శివతత్వం నిక్షిప్తమై ఉందని, ఆ శివతత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలంటే ధ్యానరూప చైతన్య స్థితిని సాధించాలని సూచించారు. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో 12 మంది ఆల్వార్లు 108 దివ్యదేశాలను కీర్తించినట్లే, శైవ సంప్రదాయంలో 63 మంది నాయనార్లు 276 శివక్షేత్రాలను కొనియాడారని తెలిపారు. వీటినే "పాదల్ పెట్టర స్థలాలు"గా పిలుస్తారని చెప్పారు.సంబందార్, అప్పర్, సుందరర్ ప్రధాన నాయనార్లుగా గుర్తింపు పొందారని, ఆల్వార్ల దివ్యప్రబంధాలకు సమానంగా నాయనార్ల శివస్తుతులను "దేవారం"గా వ్యవహరిస్తారని వివరించారు. 6వ శతాబ్దం నుండి 11వ శతాబ్దం మధ్యకాలంలో ఈ మహనీయులు జీవించారని పేర్కొన్నారు. చివరిగా భక్తులు ప్రతిరోజూ ధర్మాచరణ పాటిస్తూ, తమ తమ కులదేవతలను ఆరాధించడంతో పాటు సమాజ శ్రేయస్సు, మానవతా దృక్పథంతో పనిచేయాలని స్వామివారు ఉపదేశించారు.

# రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి





**చేతల్లో మాత్రం శూన్యం - చల్లా ధర్మారెడ్డి**

**పరకాల,మే 29, (ప్రజా జ్యోతి) :** రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో మాత్రం శూన్యమే కనిపిస్తోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు.శుక్రవారం పరకాల, నడికూడ మండలాలకు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులతో కలిసి హనుమకొండలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనుల దుస్థితి, పార్టీ పరిస్థితులపై, సభ్యత్వ నమోదు కార్యక్రమంపై, ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అంటూ ప్రజలకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు వాటి అమలులో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రతిరోజూ కొత్త మాటలు చెబుతున్నారే తప్ప అభివృద్ధి కనిపించడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచాయని, పల్లె ప్రగతి, రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలతో గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మారాయని గుర్తుచేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీలకు నిధులు నిలిపివేసి సర్పంచులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి కనీస సౌకర్యాలు కూడా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితమైందని మండిపడ్డారు. ప్రజాపాలన పేరుతో ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం అసలు ప్రజల సమస్యలపై కనీస చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులతో ముందుకెళ్తోందని, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం తప్ప రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, గ్రామీణ ప్రజలు కాంగ్రెస్ పాలనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాబోయే రోజుల్లో ప్రజలే ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు.కేంద్రప్రభుత్వం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అప్రమత్తంగా ఉండాలని,పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీశ్రేణులు బాధ్యతగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పరకాల, నడికుడ మండలాల బిఆర్ఎస్ సర్పంచులు,ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్' ప్రక్రియపై పూర్తి స్థాయి అవగాహనతో

# బూత్ ఏజెంట్స్ ముందుకు సాగాలి





- ఓటర్ల హక్కులను కాపాడటం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత
- ప్రతి బూత్‌లో కాంగ్రెస్ శక్తిని మరింత విస్తరించేందుకు కృషి చేయాలి
- నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్స్ శిక్షణ కార్యక్రమం

**దామెర, మే 29 (ప్రజాజ్యోతి) :** 'సర్' ప్రక్రియపై పూర్తి స్థాయి అవగాహనతో బూత్ ఏజెంట్స్ ముందుకు సాగాలని కడియం కావ్య తెలిపారు. శుక్రవారం దామెర మండలం దుర్గంపేట శివారులోని జాతీయ రహదారిపై గల ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించిన పరకాల నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ బూత్ ఏజెంట్స్ శిక్షణ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ శ్రీమతి కడియం కావ్య, హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి అయుబ్ తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) ప్రక్రియ, ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి బాధ్యతలపై ఎంపీ కడియం కావ్య సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఓటర్ల జాబితా నిర్వహణ, బూత్ స్థాయి అధికారుల బాధ్యతలు మరియు ఎన్నికల ప్రక్రియలో వారి పాత్రపై సమగ్ర అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని, స్థానిక ఓటర్లతో మంచి సంబంధాలు ఏర్పరచుకుని, వారి సమస్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు కేంద్ర ఎన్నికల సంఘం లేదా పార్టీ నిర్వహించే శిక్షణా తరగతులకు తప్పనిసరిగా హాజరై నిబంధనలు తెలుసు కోవాలన్నారు. ఓటరు జాబితాలో అక్రమాలు, దొంగ ఓట్ల చేరికలను ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ "ఓటు చోరీ" (ఓటు తెఫ్ట్ ) పేరుతో దేశవ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణలో పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమాన్ని చేపట్టిందన్నారు. అధికార బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై ఓట్లను తొలగిస్తున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఈ కార్యక్రమాన్ని ఉధృతం చేసిందన్నారు. ఓట్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున ఊరూరా సంతకాల సేకరణ యుద్ధాన్ని ప్రారంభించింది అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ 25 నుండి తెలంగాణలో 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (సర్) మూడో దశ ఓటరు నమోదు, జాబితా సవరణ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ఈ సర్వే ద్వారా ఇంటింటికీ బూత్ లెవెల్ అధికారులు తిరిగి అర్హులైన కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు మరియు మార్పులు చేపట్టనున్నారని తెలిపారు. మీకు కేటాయించిన నిర్దిష్ట నియోజకవర్గం లేదా బూత్ వివరాలను బట్టి, ఏవైనా డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జికి లేదా స్థానిక పార్టీ కమిటీకి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల బూత్ ఏజెంట్స్, నాయకులు పాల్గొన్నారు.

# కేశవమూర్తికి సన్మానం

**పద్మశాలి సంఘం నేతల అభినందనలు**

**పరకాల,మే 29, (ప్రజా జ్యోతి):** హనుమకొండ జిల్లా టీ యూడబ్ల్యూజే (ఐజేయు) అధ్యక్షుడిగా ఎన్నికైన గడ్డం కేశవమూర్తిని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం జిల్లా, రాష్ట్ర కమిటీ నేతలు ఘనంగా సన్మానించారు. హనుమకొం డలోని ఆయన కార్యాలయంలో కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం మాట్లా డుతూ జర్నలిస్టు సంఘంతో పాటు పద్మశాలి సమాజానికి కేశవమూర్తి సేవలు అందించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైద్య రాజగోపాల్ మాట్లాడుతూ మూడున్నర దశాబ్దాలుగా జర్నలిజం రంగంలో రాణిస్తూ పద్మశాలి సమాజానికి కేశవమూర్తి గుర్తింపు తీసుకొచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో పులికంటి రాజేందర్, నల్ల సత్యనారాయణ, బింగి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## వడదెబ్బతో వృద్ధురాలి మృతి

- లక్ష్మీపురంలో విషాదం
- కుటుంబానికి సాయం చేయాలని విజ్ఞప్తి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మే 29, (ప్రజా జ్యోతి) :** తీవ్ర ఎండల ప్రభావంతో వడదెబ్బ తగిలి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన హనుమకొండ బస్టాండ్ 7వ డివిజన్ లక్ష్మీపురంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీపురానికి చెందిన జనగాని అమృత(76) గురువారం సాయంత్రం పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు తెలిపారు.ఆమె మృతి పట్ల స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని తగిన సహాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

## బాల్య వివాహాలు బాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టు

- ఏజెన్సీ ఏరియాలో 100 శాతం బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కట్టుబడి ఉండాలి.
- ఐటిడిఏ అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రం నాగోరావు.
- పుత్తడి బొమ్మకు పుస్తెలు కాదు, పుస్తకాలు కావాలి,
- బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలి.
- జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత.



**ఏటూరు నాగారం మే 29 ప్రజాజ్యోతి :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దే లక్ష్యంతో "బాల్య వివాహం బతుకు ఆగం" నినాదంతో బాల్య వివాహాల నిర్మూలనపై బుధవారం ఐటిడిఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో వివాహాల నిర్వాహకులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు ు వెంకటాపురం మండలాలకు చెందిన పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు, ఫ్లెక్సీలు ముద్రించేవారు, క్యాటరింగ్ మరియు బ్యాండ్ మేళం నిర్వాహకులు తదితరులతో పాల్గొన్నారు. ఈ అవగాహన సదస్సుకు ఐటిడిఏ అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి కుమ్రశీ నాగో రావు గారు మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలల అభివృద్ధికి గొడ్డలిపెట్టు అని, బాల్య వివాహాలను అరికడితేనే బాల బాలికల భవిష్యత్తుకు భరోసా లభిస్తుందని, ఏజెన్సీ ఏరియాలో 100 శాతం బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కట్టుబడి ఉండాలని, తద్వారా అందరూ కలిసి సమిష్టిగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఐటిడిఏ అదనపు ప్రాజెక్టు అధికారి శ్రీ కుమ్రశీ నాగో రావు అన్నారు. బాల్య వివాహాల సమాచారం ముందుగా తెలిసే అవకాశం పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహకులు, ఫోటోగ్రాఫర్లు మొదలగువారికి ఎక్కువగా ఉంటుందని, వారు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమాచారం ముందుగానే తెలిసే అవకాశం ఉన్నందున ప్రజల సహకారం ఉంటే జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయి నుంచి బాల్య వివాహాల నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికల చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలని, చిన్న వయస్సులో వివాహాలు జరగడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.బాల్య వివాహాల నిర్మూలనలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారిణి ఈ.పి. ప్రేమలత మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే సామాజిక, ఆరోగ్య, కుటుంబ పరమైన దుష్ప్రభావాలను వివరించారు. బాల్య వివాహాలు ఒక్క వర్గానికే పరిమితం కావని, అన్ని వర్గాల్లోనూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనలో వయస్సు నిర్ధారణ అత్యంత కీలకమని, వివాహాల నిర్వహణకు ముందు వయస్సు నిర్ధారణ పత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అంతకుముందు జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె. ఓంకార్ బాల్య వివాహ నిరోధక చట్టం--2006 పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నిర్వహించినా, సహకరించినా, ప్రోత్సహించినా సదరు భాధ్యులకు 2 సం.లో వరకు జైలు శిక్ష, 1 లక్ష రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు. వరుడిపై నేరం ఆధారంగా పోక్స్ కేసు కూడా అయ్యే ప్రమాదం ఉందని వివరించారు. చివరగా బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలు, చట్టపరమైన నిబంధనలు తదితర అంశాలను వివరించారు. చివరగా ములుగు జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్ది, బాలలకు స్నేహపూర్వకంగా మార్చుటకు అంతా కట్టుబడి ఉంటామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారికి బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై రూపొందించిన వాల్ పోస్టర్లు, కర పత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వెంకటాపురం సిడిపిఓ. ముత్తమ్మ, ఆరు మండలాల నుండి బాల్య వివాహ రహిత గ్రామ పంచాయతీలుగా ఎంపిక చేసిన గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, విసిపిసి కన్వీనర్లు అయినా అంగన్వాడీ టీచర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది కృష్ణవేణి, హరికృష్ణ, సంజీవ, సుమన్, జ్యోతి, రాజు, నరేష్, డిహెచ్ఈడబ్ల్యు సిబ్బంది, ఆరు మండలాల నుండి వచ్చిన పురోహితులు, ఖ్వాజీలు, పాస్టర్లు, టెంట్ హౌస్ నిర్వాహ కులు, ఫోటోగ్రాఫర్లు, ఫ్లెక్సీలు ముద్రించేవారు, క్యాటరింగ్ మరియు బ్యాండ్ మేళం నిర్వాహకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గోలి లక్ష్మమ్మ మృతి బాధాకరం

నడిగూడెం, మే 29,ప్రజా జ్యోతి:
గోలి లక్ష్మమ్మ మృతి బాధాకరమని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోనే బృందావన పురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గోలి సునీత అత్త గోలి



లక్ష్మమ్మ మృతి చెందడంతో శుక్రవారం కోదాడ మాజీ శాసనసభ్యులు పార్థీవదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారిలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, మండల సమన్వయకర్త అనంతల ఆంజనేయులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాసరి శీను, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కాసాని ఉపేందర్, వార్డు సభ్యులు కంభంపాటి నాగేశ్వరరావు, పుట్టా సీతయ్య,మేకల వీరబాబు, ఎస్కే జలీల్, ఎండి రఫీ, తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ యూత్ సేవా స్ఫూర్తి..

కోదాడ టౌన్, మే 29(ప్రజా జ్యోతి):
కోదాడ పట్టణంలో మానవత్వాన్ని చాటుతూ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో యువకులు ఉచిత రక్తదానం చేసి సేవా భావాన్ని మరోసారి



నిరూపించారు. అత్యవసర పరిస్థితిలో ఓ పేషెంట్‌కు రక్తం అవసరం కావడంతో సమాచారం అందుకున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు వెంటనే స్పందించి రక్తదానం చేశారు. రక్తం కోసం బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్న సమయంలో యువకులు ముందుకొచ్చి సహాయం చేయడంతో వారికి పెద్ద ఊరట లభించింది. "రక్తదానం మహాదానం" అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ యువత సమాజానికి ఆదర్శంగా నిలిచారని పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన దగడు నాగి, పవన్, సన్నీ లను స్థానికులు, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. అవసరమైన సమయంలో స్పందించి ప్రాణాలను కాపాడేందుకు ముందుకొచ్చిన యువకుల సేవా తత్వం అభినందనీయమని కొనియాడారు.ఫ్రెండ్స్ యూత్ సభ్యులు మాట్లాడుతూ.. యువత అందరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని అవసరమైన వారికి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. సమాజ సేవలో భాగంగా భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

## వేసవి శిక్షణ శిబిరం క్రీడాకారులకు అల్పాహారం పంపిణీ

నడిగూడెం, మే 29, ప్రజాజ్యోతి:
బాస్కెట్బాల్ జాతీయ కోచ్ హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న నడిగూడెం గ్రామానికి చెందిన షేక్ ఇసాక్ నడిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో వేసవి కబడ్డీ శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు



శుక్రవారం అల్పాహారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకొని రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు కబడ్డీలో క్రీడాకారులకు ఉచిత శిక్షణ అందజేస్తున్న పీడీ నాగేశ్వరరావును ఈ సందర్భంగా ఇసాక్ సత్కరించారు కార్యక్రమంలో అంజన్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిని రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించాలి

టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ రాష్ట్ర కన్వీనర్ పులిగిల్ల బాలయ్య



భువనగిరి, మే 29(ప్రజాజ్యోతి):
తెలంగాణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,పదవికి చామల కిరణ్ కుమార్ రెడ్డి సమర్థ నాయకుడని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీడిపార్ట్మెంట్ తెలంగాణ రాష్ట్ర,కన్వీనర్ పులిగిల్ల బాలయ్య అన్నారు..యూత్ కాంగ్రెస్,స్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజా నాయకుడిగాఎదిగారని తెలిపారు.భువనగిరి పార్లమెంట్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామస్థాయి,సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఎంపీగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో చురుకుగా వ్యవహరిస్తున్నారని,కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పులిగిల్ల బాలయ్య తెలిపారు.. బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతి,అక్రమాలపై ధైర్యంగా గళమెత్తిన నాయకుడిగా చామల కిరణ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ యువతకు,చేరువైన నాయకుడిగా రాష్ట్రవ్యాప్తంగా మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు.అలాంటి నాయకుడిని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తే పార్టీకి మరింత బలం చేకూరుతుందని అన్నారు.

# ఉద్యమకారుల ఆశలు నెరవేర్చాలి..

ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు రావాలి

తుంగతుర్తి, మే 29,(ప్రజా జ్యోతి):
తెలంగాణ ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన వారికి సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో తెలంగాణ ఉద్యమకారులు నిర్వహించిన సమావేశం వారు పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలుగా అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేసే విధంగా కేశవరావు ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కేశవరావు కమిటీ ఏర్పాటు చేయడం, అమరుల కుటుంబాలను గుర్తించి గౌరవించడం, జైలుకు పోయిన వారిని గుర్తించడం, ఎఫ్ఐఆర్ నవోదయ నిర్బంధానికి గురైన వారిని గుర్తించడం, తెలంగాణ ఉద్యమంలో వివిధ దశల్లో పోరాటం చేసిన వారు గుర్తించి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాలయాపన చేయకుండా ఉద్యమకారులను గుర్తించి వారికి గుర్తింపు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ప్రకటించిన హామీలను అమలు చేయాలన్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, విద్యావంతులు, ప్రతి ఒక్కరు గ్రామ గ్రామాన తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంతకు ముందుకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న రిటైర్డ్



ఉపాధ్యాయుడు ఓరుగంటి సత్యనారాయణ, తెలంగాణ ఉద్యమ కారులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు పోలవరపు సంతోష్, ఎండి నసీరుద్దీన్, శంకరమంచి రవీందర్ శర్మ, దుగ్యాల రవీందర్ రావు, ఎండి.జానీ, గునిగంటి సంతోష్ గౌడ్, తడకమళ్ళ రవికుమార్, బానోతు వెంకన్న, బెడద రాములు, గౌడిచర్ల రాఘవులు, ఓరుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు రూ.6.78 కోట్ల రుణాలు

కొండమల్లేపల్లిలో ప్రత్యేక సర్వ సభ్య సమావేశం

కొండమల్లేపల్లి, మే 29, (ప్రజాజ్యోతి):
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం కొండమల్లేపల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ప్రత్యేక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. మండల మహిళా సమాఖ్య



అధ్యక్షురాలు ప్రేమలత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రతి గ్రామ సంఘం నుండి ఆఫీస్ బేరర్లు హాజరయ్యారు.సమావేశంలో గత ఏడాది మహిళా సంఘాలు సాధించిన ప్రగతి, ఈ సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సభ్యులకు వివరించారు. మహిళా సాధికారత, నూతన సంఘాల ఏర్పాటు, కిషోర బాలికల సంఘాల ఏర్పాటు, వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై విస్తృతంగా చర్చించారు.కార్యక్రమానికి హాజరైన సీబీఐ మేనేజర్ భీముడు, యూబీఐ ఫీల్డ్ ఆఫీసర్ పూజ రాజ్‌పుత్, టీజీబీ బ్రాంచ్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతూ స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగుతున్నారని కొనియాడారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొంది క్రమం తప్పకుండా చెల్లింపులు చేస్తున్న మహిళలు ఆర్థిక అక్షరాస్యతలోనూ ముందంజలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం మహిళలు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు.బ్యాంకు రుణ మేళాలో భాగంగా 68 మహిళా సంఘాలకు రూ.6 కోట్ల 78 లక్షల రుణాలను మంజూరు చేశారు. సంబంధిత చెక్కులను బ్యాంకు మేనేజర్లు మండల మహిళా సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు.పీఆర్ ఏఈ ఇందిర మాట్లాడుతూ మండలంలోని




31 గ్రామ సంఘ భవనాలకు మంజూరు లభించగా, అందులో 28 భవనాల నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. కొన్ని భవనాలు పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తిచేసుకున్నాయని, మహిళల సమావేశాల నిర్వహణకు అవి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు.
పూర్తయిన భవనాలకు బిల్లులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా బ్యాంకు అధికారులకు, పీఆర్ ఏఈకి, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులకు, ప్రతిభ కనబర్చిన గ్రామ సంఘాల ప్రతినిధులు మరియు వీఓఏలకు మెమెంటోలు అందజేసి సన్మానించారు.కార్యక్రమంలో ఏపీఎం యాదయ్య, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ప్రేమలత, కార్యదర్శి భారతి, ఏపీఎం వడ్లమళ్ళ యాదయ్య, సీసీలు బైరెడ్డి రాజేశ్వరి, గోకమళ్ళ వెంకటేశ్వర్లు, సీబీఓ ఆడిటర్ కోమండ్ల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు బాగు చేయండి.. ప్రజల ప్రాణాలు కాపాడండి !

రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించాలి .. విశాలమైన రహదారిని నిర్మించాలి

వెలగని వీధి దీపాలు.. పాదచారుల ఇబ్బందులు

మోత్కూరు, మే 29 (ప్రజా జ్యోతి):
రోడ్డు బాగు చేయండి... ప్రజల ప్రాణాలను కాపాడండి అంటూ శుక్రవారం దత్తప్పగూడెం – ముసిపట్ల – మోత్కూరు రహదారి దుస్థితిపై బీజేపీ నాయకులు నిరసన నిరసన వ్యక్తం చేశారు.




మండలంలోని దత్తప్పగూడెం నుండి ముసిపట్ల మీదుగా మోత్కూరు వరకు ఉన్న రహదారి అధ్వాన్న స్థితికి చేరుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని బీజేపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడంలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి, ఆధునిక ప్రమాణాలతో విశాలమైన నూతన రహదారిని నిర్మించాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళల్లో వీధి దీపాలు సరిగా వెలగకపోవడంతో ప్రమాదాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు వెంట వెళ్లే పాదచారులు చీకట్లో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టడంతో పాటు వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రజల భద్రత, ప్రయాణ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు బీముడి తిరుమలరెడ్డి, ఉపాధ్యక్షులు గుంటి సతీష్, నరేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కరాటే ప్రతిభా పరీక్షలు

విద్యార్థులకు పట్టాలు, ధ్రువపత్రాల ప్రదానం

మలపల్లి, మే 29, (ప్రజాజ్యోతి):
మలపల్లిలో శుక్రవారం కరాటే ప్రతిభా పరీక్షలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన పరీక్షాధికారి శిహాన్ రాపోలు



సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మాస్టర్ కొండ్రపల్లి సురేష్ అందించిన శిక్షణ ఫలితంగా పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పోలీసు అధికారులు విద్యార్థులకు పట్టాలు, ధ్రువపత్రాలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో సెన్సె ఠాకూర్ భగవాన్ సింగ్, సెన్సె వడ్ల ప్రశాంత్ పరీక్షల నిర్వహణలో సహకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్, పిల్లి మల్లేష్, మాస్టర్ శ్రీనివాస్, మాస్టర్ శ్రీజ, జహిందర్, మల్లేష్, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి చేనేత కార్మికునికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మోత్కూరు, మే 29 (ప్రజా జ్యోతి):
జియో ట్యాగ్ కలిగిన ప్రతి చేనేత కార్మికునికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అదనపు కలెక్టర్ బాస్కర్ రావు కు,



చేనేత, జోలి శాఖ ఏడీ శ్రీనివాసరావుకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటల ఫలితంగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న కాలంలో యాభై సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు ప్రభుత్వం నుండి వృధాప్య పెంక్షన్ మంజూరు చేశారని తెలిపారు. గతంలో చేనేత సహకార సంఘాల సభ్యులకు, నిరుపేద చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు ఉండేవని, కాని వాటిని రద్దు చేయడంతో ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆసరా పెంక్షన్ కోసం కొత్తగా దరకాస్తు చేసుకొనుటకు వయస్సు కు సంబంధించి ఆధార్ కార్డు , ఓటర్ ఐడి కార్డు ద్వారా నిర్ధారణ జరుగుతున్నప్పటికీ చేనేత కార్మికులకు 50 సంవత్సరాలకి అర్హత కలిగి ఉన్నందున చేనేత గుర్తింపు కార్డు ఉంటేనే వర్తిస్తుందని అధికారులు చెప్పడంతో చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అర్హత కలిగి జియో ట్యాగ్ ఉన్న ప్రతి చేనేత కార్మికునికి పెంక్షన్ పొందే విధంగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు బోడ ఆంజనేయులు, చెన్న రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలి

మోత్కూరు, మే 29 (ప్రజా జ్యోతి): మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలని, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుండి తీసుకుంటున్న ఫీజుల వివరాలను బహిరంగంగా (బోర్డులపై) ప్రదర్శించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు శుక్రవారం మండల ఇన్చార్జి ఎంఈఓ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జిట్టా గౌతం మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తెచ్చినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. ట్యూషన్ ఫీజు, డెవలప్మెంట్ ఫీజు, బిల్డింగ్ ఫండ్ పేరుతో పాఠశాల యాజమాన్యాలు తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నాయన్నారు. దీంతో పేద, మధ్యతరగతి విద్యార్థుల చదువులు భారంగా మారాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు కరుణాకర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు



# మోడీ బీ జే పీ కేంద్ర ప్రభుత్వానికి కార్పోరేట్ సంస్థలపై ఉన్న ప్రేమ రైతులపై లేదు

అందుకు వరికి క్వింటాకు కేవలం 72 రూపాయలు ప్రకటించడమే నిదర్శనం

ఆలేరు మే 29 ప్రజా జ్యోతి:
కేంద్రంలో బీజేపీ నరేంద్ర మోడీ ప్రభుత్వం కు దేశంలో బడా కార్పొరేట్ సంస్థల అధిపతులపై ఉన్న ప్రేమ, దేశానికి తిండి పెడుతున్న రైతన్నలపై లేదని అఖిల భారత రైతు.కూలీ సంఘం(ఏ ఐ కే ఎం ఎస్)రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య స్పష్టం చేశారు. మే 27 నుండి 31 వరకు మోడీ నామ మాత్రం కనీస మద్దతు ధరను వ్యతిరేకిస్తూ ఆర్డర్ ప్రతులను దహనం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్ కే ఎం) ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డు లో ఏ ఐ కే ఎం ఎస్ ఆధ్వర్యంలో రైతులు కనీస మద్దతు ధర ఆర్డర్ ప్రతులను దహనం చేశారు.ఈ సందర్భంగా భిక్షపతి, అడివయ్య మాట్లాడుతూ, వారికి క్వింటాకు కేవలం 72/- ప్రకటించడం అంటే రైతులను మోడీ ప్రభుత్వం అడుకునే వాళ్ళు గా చూస్తుందని,అందుకే కనీస మద్దతు ధర అంటే బీ జే పీ కి భిక్షం వేసినట్లుగా చూస్తుందని ఆరోపించారు.ఆరుగాలం కష్టపడి కింటా కు 72/- ప్రకటించడం దేనికి



లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి పుట్ల కొద్ది ధాన్యాన్ని దేశానికి అందిస్తే ఆ రైతు శ్రమను,పెట్టుబడిని ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఎంగిలి మెతుకులు విసిరినట్లుగా నిదర్శనమో రైతులు అర్థం చేసుకుంటున్నారని అన్నారు. వారంలో అయిదుసార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన మోడీ బీ జే పీ,రైతులకు కనీస గిట్టుబాటు ధరలు ప్రకటించకపోవడం అన్యాయం అని అన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదని చెప్పే పాలకులు ఆ రైతు వెన్నుపూస ను విరగొడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.జనార్ధన్, జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు చిర బోయిన రాజయ్య,జిల్లా నాయకులు పిన్నపురెడ్డి రాఘవ రెడ్డి,తమ్మడి అంజయ్య,మార్కెట్ యార్డు హమాలీ కార్మిక నాయకులు కర్రె శ్రీకాంత్, దొప్ప వెంకటేష్,కడకంచి మహేష్, కర్రె మల్లేష్, జోగు కుమార్,బాలరాజు,దడిగే రవి, అయిల కృష్ణ,కె.సురేష్, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా నాయకులు కొమ్మిడి గోపాల్ రెడ్డి, పీ వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్,గోవిందు పరమేశ్,రైతు.కూలీలు ఆలేటి యాదగిరి, ఆలేటి మంగమ్మ, ఐ ఎఫ్ టి యు నాయకులు దార యాదగిరి, కల్లెపు చంద్రయ్య, ఓరుగంటి మైసయ్య,కొమ్మిడి శ్రీకాంత్ రెడ్డి,నర్సింహారెడ్డి, ఊరడి రామ చంద్రు, ఆకుల కృష్ణ,కొమ్మిడి గాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ



**కొడిపల్లి ప్రజా జ్యోతి మే29**
పేదల సొంతింటి కల నెరవేడుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు శుక్రవారం మండల కేంద్రమైన కౌడిపల్లి లో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్ తో కలిసి ఇందిరమ్మ ఇండ్లు కు భూమి పూజ చేశారు ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని అందుకు లబ్ధిదారులకు ఐదు లక్షల రూపాయలను విడుదలవారీగా అందజేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3500 ప్రభుత్వం మంజూరు చేయగా ఇందిరమ్మ కమిటీల ద్వారా 2100 ఇండ్లను ఎమ్మెల్యే కోటా కింద 1400 ఇండ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు వర్షాకాలం సమీపిస్తున్న వేళ లబ్ధిదారులు త్వరగా పనులు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ తాసిల్దార్ కృష్ణ ఏఈ ఉపసర్పంచ్ శ్వేత మల్లికార్జున గౌడ్, వార్డు సభ్యులు రాజీవ్ రెడ్డి , దేవేందర్, సందీప్ కుమార్, లక్ష్మీ శరత్ కుమార్ బొంతమ్మ సంగప్ప యాదమ్మ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సార రామా గౌడ్, సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, అమర్ సింగ్ రాథోడ్ ,యువ నాయకులు పోల నవీన్ కుమార్, మాజీ వైస్ ఎంపీపీ నవీన్ కుమార్ గుప్తా, మాజీ కో ఆప్షన్ నెంబర్ మహ్మద్ హైమద్ సర్పంచులు ఎల్లం, రవి యాదవ్ గణేష్ నాయక్ పుండరీకం గౌడ్ వెంకటేశ్వరరావు రమేష్ గౌడ్ బీస పురుషోత్తం పంచాయతీ కార్యదర్శి వెంకటేశం కారోబార్ ఎల్లం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నకిలి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

– హెచ్చరించిన టాస్క్ పోర్స్ కమిటీ ఏడిఏ, ఏఎస్సై



**కొల్చారం (ప్రజాజ్యోతి) మే 29 :**
మండలంలోని ఫర్టిలైజర్ దుకాణదారుల షాపులను మండల్ టాస్క్ ఫోర్స్ కమిటీ తనిఖీ చేశారు . టాస్క్ ఫోర్స్ కమిటీ లో తహసీల్దార్ , సీఐ మరియు ఏడిఏ సభ్యులుగా ఉన్నారు. శుక్రవారం ఆగ్రోస్ మరియు దుర్గ భవాని, మల్లికార్జున ఫర్టిలైజర్స్ షాపులలోని విత్తనాలు ,ఎరువులు, పురుగుమందుల రిజిస్టర్స్ కమిటీ సభ్యులు తనిఖీ చేశారు . ఈ సందర్బంగా ఏ డి ఏ మాట్లాడుతూ రైతులకు మంచి నాణ్యమైన విత్తనాలను, పురుగుమందులను సకాలంలో అందించవల సిందిగా డీలర్స్ సూచించారు .అదేవిధంగా మండల ఏ ఎస్సై లక్ష్మి రెడ్డి × మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అమ్మిన ఎడల చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు . ఏ డి ఏ మాట్లాడుతూ ప్రతి డీలరు రోజువారి క్రయవిక్రయాలను రిజిస్టర్లో పొందుపరచాలి .అదేవిధంగా స్టాక్ బోర్డును కనిపించే విధంగా ప్రదర్శించాలి, అధిక ధరలకు అమ్మిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఓ శ్వేత కానిస్టేబుల్ పాల్గొన్నారు.





# పేదల పెన్నిధి డాక్టర్ మైనంపల్లి రోహిత్

**మెదక్ (ప్రజాజ్యోతి) మే 29 :**
ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను 13 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు.అనారోగ్యాల రీత్యా ప్రైవేటు ఆసుపత్రు లలో చికిత్స చేయించుకొని ఆసుపత్రులలో బిల్లులు కట్టలేని పరిస్థితుల్లో ఉన్న పేదవర్గాలకు చేయూత నివ్వడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 13 మంది లబ్ధిదారులకు 10 లక్షల 85000/- రూపాయలను మంజూరు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ కానుగు రాధిక భూపతి రాజు , వైస్ చైర్మన్. దొంతి నరేష్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందు గుల. గంగాధర్ , మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ , కౌన్సిలర్లు శ్రీమతి హరిత నర్సింగ్ రావు , ఎరుకల నరసింహులు , హవారీ రాజశేఖర్ , నాయకులు కొట్టాల విశ్వం, బొద్దుల కృష్ణ, బుడ్డ రాజు, పూసల సంతు, అశ్రవల్ల బాలరాజ్, చెదల నవీన్, చెప్పాలే సంజీవ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ బడిలో చేర్పించండి

– పిల్లల శారీరక, మానసిక వికాసానికి పునాది
– మగ్ధుంపూర్‌లో బడిబాట నిర్వహించిన ఉపాధ్యాయులు

**నంగునూరు, మే 29(ప్రజా జ్యోతి):-**
ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించి వారి శారీరక, మానసిక వికాసానికి పునాది వేసుకోవాలని మగ్ధుంపూర్ సర్పంచి పాకాల శ్రీనివాస్ తల్లిదండ్రులకు పిలుపు ఇచ్చారు. మండలపరిధిలోని మగ్ధుంపూర్ లో శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారు ప్రసాద రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు బడి బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాకాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య ఉచితంగా అందుతుందని చెప్పారు. పిల్లల భవిష్యత్తుకు ఉజ్వల పునాది ఏర్పడుతుందని తెలిపారు. జీవన నైపుణ్యాలను నేర్చుకోవడంతో పాటు, పిల్లల్లో మానసిక, శారీరక వికాసం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అర్హులైన, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయికి అనుగుణంగా విద్యా బోధన చేస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివించడం వల్ల వేల రూపాయలు అదా అవుతా యన్నారు. యూనిఫాం, పుస్తకాలు, నోటు పుస్తకాలు ఉచితంగా ఇవ్వడమే కాక అల్పాహారం, మధ్యాహ్న భోజనం, వాణి మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారు ప్రసాద రెడ్డి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్లూరి నర్సింలు, టి.విజయలక్ష్మి, లీల, కృష్ణవేణి పాల్గొన్నారు.



# రైతు ధాన్యంపై రాజకీయాలు చేయడం దురదృష్టకరం “ఆవుల”

- అబద్ధాల రాజకీయాలకు ప్రజలే చెక్ పెడతారు
- విమర్శలు కాదు.. రైతుకు ఉపయోగపడే పని చేయాలి
- నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఫలించవు









**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) మే 29:**
నర్సాపూర్ నియోజకవర్గ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి స్పష్టం చేశారు.వెల్దుర్తి మండలంలోని మంగళపర్తి, కుకునూరు పిఎసిఎస్ గోదాములతో పాటు ప్రైవేట్ గోదాములు, రైతు వేదికలను స్వయంగా పరిశీలించిన ఆయన, రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా వెంటనే నిల్వ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి భారీగా ధాన్యం రాకతో గోదాముల కొరత ఏర్పడిన నేపథ్యంలో, అందుబాటులో ఉన్న ప్రతి గోదామును కొనుగోళ్ల కోసం వినియోగించాలని సూచించారు. రైతు కష్టం వృథా కాకూడదనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే, కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఎమ్మెల్యే రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు నమ్మరన్నారు.రైతు పండించిన ప్రతి గింజకు విలువ దక్కాలి, ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఆవుల రాజిరెడ్డి తెలిపారు. వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను అప్రమత్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నరేందర్ రెడ్డి, సుధాకర్ గౌడ్, మహేష్ రెడ్డి, నరసింహారెడ్డి, తలారి మల్లేష్, కృష్ణా గౌడ్, డీసీఎస్ఓ, డీఎం, ఆర్ఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చీకట్లో మృత్యుఘంటికలు: ప్రమాదానికి కేరాఫ్‌గా ట్రాన్స్‌ఫార్మర్ల కట్ట

– రక్షణ కంచె లేకపోవడంతో భయంలో స్థానికులు – పట్టించుకోని విద్యుత్ శాఖ
– వర్షాకాలం వస్తే పరిస్థితి ఏంటని గ్రామస్తుల ఆందోళన





**అల్లాదుర్గం మే 29 (ప్రజాజ్యోతి)**
అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి ఈ దృశ్యం నిలువెత్తు నిదర్శనం. చిల్వర్ గ్రామ నడివోడ్డున ఉన్న ఓ కూడలిలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు రాతి కట్టపై ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా, రక్షణ కంచె లేకుండా వదిలేయడంతో స్థానికులు, రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ఇక్కడ ఏర్పాటు చేశారు. రాతి కట్టపై అమర్చి చేతులు దులుపుకున్నారు తప్ప, చుట్టూ కంచె వేయడం గానీ, ప్రమాద హెచ్చరిక బోర్డు పెట్టడం గానీ చేయలేదు. దీంతో కట్ట చుట్టూ పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి, విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతూ కనిపిస్తున్నాయి. ఇది గ్రామ నడి బొడ్డున ఉన్న ప్రధాన దారి కావడంతో రోజూ ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, ఇతర వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. పక్కనే ఇళ్లు కూడా ఉండటంతో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఇటు వచ్చే ప్రమాదం ఉంది. రాత్రి వేళల్లో చీకటి కారణంగా ఈ కట్ట కనిపించక ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. “ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు” “రాత్రిపూట గ్రామస్తులు, పశువులు ఇటు వస్తే షాక్ కొట్టి చనిపోయే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో కట్ట చుట్టూ నీరు నిలిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏఈ, లైన్‌మెన్లు పట్టించుకోవడం లేదు. ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు?” అని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.”ఇటీవల కురిసిన వర్షానికి పక్క ఊరిలో ఇలాగే కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఆవు షాక్‌తో చనిపోయింది. మా ఊరిలో అలా జరగకూడదంటే వెంటనే అధికారులు స్పందించాలి” అని కోరారు.విద్యుత్ నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం, ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ తప్పనిసరిగా రక్షణ కంచె, ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలి. కట్ట చుట్టూ మూడు అడుగుల మేర పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలి. కానీ ఇక్కడ ఆ నిబంధనలన్నీ గాలికొదిలేశారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే అధికారులకు తెలివొస్తుందా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కట్ట చుట్టూ వెంటనే ఇనుప కంచె ఏర్పాటు చేయాలి. కిందికి వేలాడుతున్న హైటెన్షన్ వైర్లను సరిచేసి, ఇన్సులేషన్ చేయాలి. “ప్రమాదకరం – దూరంగా ఉండండి” అనే బోర్డులను తెలుగులో ఏర్పాటు చేయాలి. కట్ట చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు, చెత్తను వెంటనే తొలగించాలి. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించి, భద్రతా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదం జరిగాక స్పందించే కంటే ముందుగానే మేల్కోవడం మంచిదని అధికారులు గుర్తించాలి

# యోగానే ఉత్తమ జీవన విధానం

– జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి





**సిద్ధిపేట,మే 29 ,(ప్రజాజ్యోతి):**
ఆధునిక జీవనశైలి, పెరుగుతున్న కాలుష్యం, ప్రకృతి విధ్వంసం కారణంగా మానవ ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. యోగ సాధన ద్వారానే శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం కోమటి చెరువు రుబీ నెక్లెస్ వద్ద నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా జడ్జెస్, కోచెస్ శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనుషుల జీవనశైలి పూర్తిగా మారిపోయిందని, చెడు ఆహారపు అలవాట్లు, కాలుష్య ప్రభావం, ఒత్తిడితో కూడిన జీవనం అనేక రోగాలకు దారితీస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో యోగానే సంపూర్ణ ఆరోగ్యానికి మార్గమని పేర్కొన్నారు. యోగ సాధన మనిషిలో క్రమశిక్షణ, ఏకాగ్రత, మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరుగుతోందని, భవిష్యత్తులో యోగా శిక్షకులు, జడ్జీలకు మరింత డిమాండ్ ఉండబోతుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో యోగాను ప్రోత్సహిస్తున్నామని, చిన్నప్పటి నుంచే విద్యార్థులకు యోగా అలవాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్ మాట్లాడుతూ సిద్దిపేట ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. యోగా రంగంలో కూడా జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని తెలిపారు.రాష్ట్ర యోగ అధ్యయన పరిషత్ సభ్యుడు తోట సతీష్ మాట్లాడుతూ ప్రస్తుతం యోగా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోందని చెప్పారు. ఆధునిక సాంకేతికతతో యోగా పోటీలు, శిక్షణా విధానాలు మరింత అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు.అంతకుముందు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన యోగ సాధకులతో సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహించారు. అనంతరం డీఈవో శ్రీనివాస్ రెడ్డిని శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. యోగ సాధకులు ప్రదర్శించిన యోగ విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రామ్ రెడ్డి, వ్యాస మహర్షి యోగ సొసైటీ చైర్మన్ డాక్టర్ అరవింద్, అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, యోగ గురువు తోట సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా గంప శ్రీనివాస్

– నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు



**సిద్ధిపేట,మే 29 ,(ప్రజాజ్యోతి):**
తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సిద్దిపేట జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు గంప శ్రీనివాస్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని చింతల్‌బస్తీలో ఉన్న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గంప శ్రీనివాస్ సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.అనంతరం గంప శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్య విద్యార్థుల విద్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కోసం కృషి చేస్తానన్నారు. రాజకీయ రంగంలో వైశ్యులకు తగిన ప్రాధాన్యం దక్కేలా రాష్ట్ర నాయకత్వంతో కలిసి పనిచేస్తామన్నారు.గంప శ్రీనివాస్ నియామకం పట్ల సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఆర్యవైశ్య నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, కోశాధికారి డా. మంకాల నవీన్ కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు యాసాల వెంకట్ లింగం, మాజీ అధ్యక్షుడు కాసం నవీన్ కుమార్, మహిళా నాయకురాళ్లు మంకాల నాగరాణి, మాడిశెట్టి హేమలత, యువజన నాయకులు మంకాల నగేష్, పబ్బ మాధవి, రవికంటి చంద్రశేఖర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## గంగాడి తిరుపతి రెడ్డి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన ఓడితల ప్రణవ్ బాబు

వీణవంక, మే 29(ప్రజాజ్యోతి )
వీణవంక మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా



హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఓడితల ప్రణవ్ బాబు వారి నివాసానికి వెళ్లి దంపతులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి తిరుపతి రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రజా సేవలో ఆయన చూపుతున్న నిబద్ధత యువ నాయకులకు ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, నాయకులు నల్ల కొండల్ రెడ్డి, ఆవాల రామకృష్ణ తదితరులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## రాజారాంపల్లిలో అంగన్వాడీ బడిబాట కార్యక్రమం,

ఎండపల్లి, మే 29 ప్రజా జ్యోతి
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అంగన్వాడి బడి బాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని



రాజారాంపల్లి గ్రామంలో ,గ్రామ సర్పంచ్ సంఘ రమేష్, పాలకవర్గం ,సమన్వయంతో, అంగన్వాడీ టీచర్లు , ఆశా కార్యకర్తలు శుక్రవారం రోజున ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ,అంగన్వాడి బడిబాట కార్యక్రమం నిర్వహించారు, ముఖ్య అతిథులుగా విచ్చేసిన సూపర్వైజర్ ఆండాళ్ మాట్లాడుతూ, మూడు నుండి ఐదు సంవత్సరాల వయసు గల చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ ప్రాథమిక విద్యను బలవపేతం చేయడం, పౌష్టికాహారం, అంగన్వాడి కేంద్రంలో లభించే సౌకర్యాలను వివరించారు, ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఆండాళ్,అంగన్వాడి టీచర్లు కళ్యాణి, రజిత, గ్రామ పంచాయతీ కార్యదర్శి మల్లేశం, కారోబార్ హరీష్,ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు,

## మహిళా సంఘాల అభివృద్ధికి రుణ సహకారం

- విఓఏల సమావేశంలో లోన్ మేళా
- సంఘాల అభివృద్ధికి బ్యాంకుల చేయూత

కొడిమ్యాల,మే 29,(ప్రజాజ్యోతి):
ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో విఓఏల సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలు పద్మ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో లోన్ మేళా, జీవనోపాధుల గ్రౌండింగ్ కార్యక్రమాలపై చర్చించారు.



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొడిమ్యాల బ్రాంచ్ మేనేజర్ సంజీవ్ కుమార్, ఇండియన్ బ్యాంక్ పూడూరు బ్రాంచ్ మేనేజర్ అజయ్ కుమార్ కార్యక్రమానికి హాజరయ్యారు. అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని ఎపియం మల్లేశం కోరారు.ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.3.62 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. సంఘాలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, బకాయిలు లేకుండా చెల్లింపులు చేయాలని యూబీఐ మేనేజర్ సంజీవ్ కుమార్ సూచించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీసీలు విరాకుమార్, మరియా, స్వరూప, మంగ, మండల సమాఖ్య కార్యదర్శి, కోశాధికారి, అకౌంటెంట్ సుకన్యతో పాటు వివిధ గ్రామాల విఓఏలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు

### మండల వ్యవసాయ అధికారి జ్యోతి

కొడిమ్యాల, మే 29,(ప్రజాజ్యోతి):
నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు పూడూర్, నమిలికొండ గ్రామాల్లో విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్స్‌ను పరిశీలించారు. డీలర్లు వరిసన్న రకాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. స్టాక్‌బోర్డు, ధరల పట్టికలను ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లు రసీదులు ఇవ్వాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నకిలీ లేదా అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే విత్తన చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.



# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

తంగళ్ళపల్లి, మే – 29(ప్రజా జ్యోతి)
తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం,తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. ఈ సారి వరి దిగుబడి,కొనుగోలు కేంద్రాలకు రాక పెరిగిందని,జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి దాకా 80 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. డీఆర్డీఓ,సహకార శాఖ,మెప్మా,పౌర సరఫరాల శాఖ,రవాణా శాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలు ధాన్యం, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేసేలా మండలాలకు ప్రత్యేక అధికారులు, అన్ లోడింగ్ వద్ద అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పై ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తూ.. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో కొంత వర్షం కురిసిందని దీంతో తాను తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించానని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అపరల్ పార్క్,గోదాములకు తరలించి అక్కడ అన్ లోడింగ్ చేయిస్తున్నామని,హమాలీలకు నీరు,ఆహారం అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వర్షం



కారణంగా తడిసిన ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేవని, రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని,సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పరిశీలనలో జిల్లా సహకార అధికారి రామకృష్ణ,జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు,మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట :

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- శాత్రాజుపల్లిలో నూతన అంగన్వాడీ కేంద్రం ప్రారంభం

వేములవాడ, మే 29 (ప్రజాజ్యోతి):
వేములవాడ పట్టణంలోని శాత్రాజుపల్లిలో 2వ, 3వ వార్డుల పరిధిలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు, అలాగే గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకునేందుకు "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిరక్షణ, గర్భంలోని శిశువుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడమే కాకుండా వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళలు మరియు చిన్నపిల్లలకు అవసరమైన ప్రతి విషయంలో ప్రభుత్వం చేయూత నిస్తోందని తెలిపారు. గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సభలు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటికే 100 నూతన అంగన్వాడీ భవనాలు నిర్మించామని, మరో 50 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ స్పందిస్తూ త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు జ్యోతి, సంతోష్, తూము మధు, కొక్కుల రాజు, తోట రాజు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు



## వరి కొయ్యలని కాల్చకుండా కలియదున్నాలి

### మండల వ్యవసాయ అధికారి కె సంజీవ్

తంగళ్ళపల్లి మే 29 (ప్రజాజ్యోతి)
వరి కొయ్యలను కాల్చడం ద్వారా అనేక ప్రమాదాలు సంభవించడమే కాకుండా ఆస్తి ప్రాణ నష్టం తో పాటు పర్యావరణ ఆరోగ్యం దెబ్బతింటుంది. నేల సారవంతం కోల్పోవడం తో పాటు పంట దిగుబడి కూడ తగ్గుతుందని తెలియచేయడం జరిగింది. వరి కొయ్యలకు నిప్పు పెట్టడం వలన గాలి నేల కలుషితం అయ్యి మట్టి



లోని తేమ ఆవిరి అయిపోయి నేల ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి పంటలకి మేలు చేసే బాక్టీరియా,వానపాములు,మిత్ర పురుగులు కూడ చనిపోతున్నాయి.
వరి కొయ్యలను,వ్యర్థలను కాల్చడం వలన మట్టిలోని నత్రజని,బాస్వరం వంటి పోషకాలు బూడిదయి వృధాగా పోతున్నాయి. పొలాల్లో మంటలు పెట్టడం వలన ప్రమాద కరమైన వాయువులు విడుదల అయి గాలి నాణ్యతనీ తగ్గించి శ్వాసకోస,అస్తమా వంటి రోగాలకు దారి తీస్తుంది అని అన్నారు. పై నష్టలను దృష్టి లో పెట్టుకొని రైతులు వరి కొయ్యలను కాల్చడం మానేసి వ్యర్థలను సహజంగా కుళ్లాబెట్టడం లేదా భూమిలో కలియదున్నడం చేయడం చేయాలి. అలాగే భూమిలో కలియదున్ని ఎకరానికి 50 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పెట్ వాడటం వలన రెండు వారాలలో పంట అవుశేషాలు కుళ్ళిపోయి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయి. లక్ష్మీపూర్ గ్రామం తంగళ్ళపల్లి మండలంలో మండల వ్యవసాయ అధికారి కే సంజీవ్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి లక్ష్మణ్ అవగాహన కల్పించడం జరిగింది.

## కాంట వేస్తలేరు... తిప్పలు తప్పడం లేదు...

కథలాపూర్, మే 29(ప్రజాజ్యోతి):
రైతులకు వద్ద కొనుగోలు తిప్పలు తప్పడం లేదు. చేతికొచ్చిన పంటను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తెచ్చి నెల దాటినా కొనడం లేదంటూ రైతన్నలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్మడానికి అన్నదాతలు ఆపసోపాలు పడుతున్నారు. ఒకవైపు ఉదయం తీవ్ర మండుటెండలు సాయంత్రం ఆకాశం మేఘావృతం అవుతుండటంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోతుందని అన్నదాత ఆందోళన చెందుతున్నారు. దాదాపు 80 శాతం కొనుగోలు పూర్తి అయింది అని అధికారులు చెబుతున్న కొనుగోలు కేంద్రాలకు ఊహించిన దాని కంటే ఎక్కువ ధాన్యం రావడంతో జాప్యం జరుగుతోంది. ఇటీవల కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి మొలకలొస్తున్నాయి. దీనికితోడు తేమ పేరుతో కేంద్రాల నిర్వాహకులు అధిక తూకం వేస్తుండటంతో కర్షకులు నష్టపోతున్నారు. పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. నా పేరు వంగ గంగమల్లయ్య కథలాపూర్ మండలం తాండ్రియాల గ్రామం. మాయిశ్చర్ వచ్చి నెల రోజులు గడుస్తున్న చిట్టీల పేరుతో తూకం ఆలస్యం చేస్తున్నారు. రోజు పొద్దుగాల అచ్చుడు. పగటిలీ పోయి తిని అచ్చుడు. రాత్రి మళ్ల ఇంటికి పోవుడు. ఇంటికి పోయినా భయమే సార్. అడ్లు ఏమైనయో.. గాలిదుమారం గిట్ల అచ్చెనా.. అన్న రందితోటే పండుడు అయితంది. తిన్న తిండి పెయిన పడ్తలేదు. కంటి నిండ నిద్ర వస్తలేదు. మరోవైపు హమాలీ, లారీల కొరత అంటూ సాకులు చెబుతున్నారు. వడ్లు ఎండకు ఎండి వరి ప్యాలాలు అయ్యేలా ఉన్నాయి. తరుగు పేరిట సంచికి 2, 3 అంటూ కిలోలు కోత



పెడుతున్నారు. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. నెల రోజులుగా పడిగాపులు కాస్తున్న.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- నాచుపల్లి, పూడూరులో అభివృద్ధి పనుల తనిఖీ
- జూన్ 30లోగా నిర్మాణాలు పూర్తి చేయాలి
- అడిషనల్ కమిషనర్ రవీందర్

కొడిమ్యాల, మే 29,(ప్రజాజ్యోతి):
అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కమిషనర్ రవీందర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కొడిమ్యాల మండలంలో ఉపాధి హామీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. నాచుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను తనిఖీ చేసిన ఆయన, పూడూరు గ్రామంలో మురుగు నీటి కాలువ పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ భవనాలు, వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్ల నిర్మాణాలు నిర్ణీత



గడువులోగా పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జూన్ 30 నాటికి అన్ని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ గౌతమ్‌రెడ్డి, డీఆర్‌డీఓ రఘువరన్, డీపీఓ మదన్, ఎంపీడీఓ స్వరూప, ఎంపీఓ భగవాన్‌రెడ్డి, ఏఈ పీఆర్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్ జరగొద్దు

- : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ..నాణ్యత పరిశీలించిన ధాన్యాన్నే రైస్ మిల్లులకు తరలించాలి
- ..జూన్ 2 నాటికి అన్ని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కోనుగోలు పూర్తి చేయాలి
- ..ధాన్యం కోనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి ప్రతినిధి, మే–29 ప్రజా జ్యోతి;
జిల్లాలో రైతుల ధాన్యం కొనుగోళ్ల లో ఎలాంటి కటింగ్ జరగొద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్ జరగకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు



విరుద్ధంగా వ్యవహరిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాణ్యత పరిశీలించిన ధాన్యాన్ని మాత్రమే రైస్ మిల్లులకు తరలించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కటింగ్ చేయవద్దని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 2 నాటికి అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి కేంద్రాలను మూసివేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో కలిందిని, డీసీవో శ్రీమాల, ఏపీఎంలు, ఏ.పి.ఓ.లు ,సంబంధిత అధికారులు తదితరులు ,పాల్గొన్నారు.

## వేములవాడలో గాలి దుమారం.. బాలనగర్ కమాన్ వద్ద తెగిపడ్డ విద్యుత్ వైర్లు

- క్షేత్రస్థాయిలో ఉండి యుద్ధప్రాతిపదికన విద్యుత్ మరమ్మతులు చేపిస్తున్న చైర్మన్
- పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు విజ్ఞప్తి

వేములవాడ,మే,29:ప్రజాజ్యోతి.
వేములవాడ పట్టణంలో గురువారం రాత్రి 11గంటలకు అకస్మాత్తుగా వాతావరణం మారిపోయి తీవ్రమైన గాలి దుమారం వీచింది. ఈదురుగాలుల ప్రభావంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలోని బాలనగర్ కమాన్ సమీపంలో వీచిన బలమైన గాలి దుమారానికి ప్రధాన రహదారిపై ఉన్న విద్యుత్ తీగలు ఒక్కసారిగా తెగిపడ్డాయి. దీంతో బాలనగర్ పరిసర ప్రాంతాలతో పాటు పట్టణంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. బాలనగర్ కమాన్ వద్ద విద్యుత్ వైర్లు తెగిపడిన సమాచారం అందుకున్న మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ తక్షణమే స్పందించారు. వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పరిస్థితిని గమనించిన చైర్మన్.. అక్కడి నుంచే పట్టణ విద్యుత్ శాఖ సహాయ ఇంజనీరు (ఏఈ) సిద్ధార్థతో ఫోన్లో మాట్లాడారు. రోడ్డుపై వైర్లు తెగిపడిన విషయాన్ని వివరించి,



అత్యవసర సిబ్బందిని పంపాలని కోరారు. చైర్మన్ పిలుపుతో విద్యుత్ శాఖ సాంకేతిక సిబ్బంది అవసరమైన సామగ్రితో యుద్ధప్రాతిపదికన అక్కడికి చేరుకున్నారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల పర్యవేక్షణలోనే సిబ్బంది తెగిపడిన పాత వైర్లను తొలగించి, కొత్త లైన్లు వేసేందుకు మరమ్మతు పనులను ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. గాలి దుమారం తీవ్రత ఎక్కువగా ఉన్నందున వేములవాడ పట్టణ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావరణం మారే వరకు ఎవరూ కూడా అనవసరంగా ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధుల విషయంలో జాగ్రత్తలు వహించాలని కోరారు. పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడినా, భారీ వృక్షాలు లేదా కొమ్మలు విరిగి రోడ్లపై పడినా వెంటనే మున్సిపల్ కార్యాలయానికి లేదా స్థానిక అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. గాలి దుమారం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు మరియు నష్ట నివారణ చర్యల కోసం మున్సిపల్ విభాగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# ఒంటికాలిపై నిలబడి వీఓఏల వినూత్నంగా నిరసన

– 12వ రోజుకు చేరిన దీక్షలు

**రఘునాథపాలెం ప్రజా జ్యోతి**

న్యాయమైన కోరికల సాధన కోసం గత 12 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న ఐకెపి వీఓఏలు రఘునాథపాలెం కేంద్రంలోని వినూత్న నిరసన తెలిపారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట వివోఏలు చేపట్టిన నిరసన దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. కనీస వేతనం రూ.20వేలు అమలు చేయాలని, 58 జీవో ను సవరించాలి,ఉద్యోగ భద్రత, హెచ్ఐర్ పాలసీ సౌకర్యం కల్పించాలని. డిమాండ్ చేస్తూ శుక్రవారం ఒంటికాలిపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. ఇంత ఎండలో ఉంటూ మా గోడును ఇకనైనా ప్రభుత్వం గుర్తించి పట్టించుకోవాలని. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వీఓఏలు ప్రభుత్వాన్ని ఈ మేరకు కోరారు. ఈ



కార్యక్రమంలో స్వాతి భాస్కర్, యుగంధర్, రామారావు, సంపూర్ణ, రేణుక ఈశ్వరి, శృతి, లలిత, ఉమ రాణి, లక్ష్మి, జ్యోతి, అనురాధ వసంత, వరలక్ష్మి, శివ, ప్రియాంక, సునీత, కాజాబీ, సలేహా, సుజాత, తదితరులు ఈ దీక్షలో పాల్గొన్నారు.

# ఏరియా పర్సనల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుపతి

– శుభాకాంక్షలు తెలియజేసిన ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతి కుమార్

**సత్తుపల్లి మే29(ప్రజా జ్యోతి)**

సత్తుపల్లి ఏరియాలో జి.ఎం కార్యాలయంలో ఏరియా ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారానికి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి ,కొత్తగూడెం ఏరియా పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఏరియా ఐఎన్టీయూసీ నేత తీగల క్రాంతికుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా,పూల బొకేతో సన్మానించారు.అనంతరం క్రాంతి కుమార్ మాట్లాడుతూ కార్మికులకు రావలసిన ప్రమోషన్స్, ఇంక్రిమెంట్స్ సకాలంలో ఇచ్చే విధంగా చూడాలని కోరారు. కార్మికుల సంక్షేమం సమస్యల పరిష్కారం సంస్థ అభివృద్ధికి పరస్పర సహకారం అందే విధంగా చూడాలని , యాజమాన్యం మరియు కార్మికుల సత్సంబంధాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఏరియా పర్సనల్ మేనేజర్ తిరుపతి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారని



కార్మికులకు న్యాయం చేసేలా సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఎస్.ఓ.టు జి.ఎం బొల్లం శ్రీనివాస్,జే.వి.యర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహ్లాద్ , కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ సునీల్ వర్మ, జే.వి.ఆర్ సి.హెచ్.పి డీ.జీ.ఎం సోమశేఖర్ , సంక్షేమ అధికారి శ్రీనివాస్ ఇతర ఉన్నతాధికారులు ఐఎన్టీయూసీ ప్రతినిధులు పోగల నాగేశ్వరరావు, మోహన్,రషీద్, రాజేందర్, వెంకటేశ్వర్లు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

– ఎమ్మెల్యే రాగమయి – మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**సత్తుపల్లి మే29(ప్రజా జ్యోతి)**

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని, కుటుంబానికి ఆర్థికంగా ఉండాలని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను





పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పరిపాలనలో సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ,అభివృద్ధి చెందాలని ఉద్దేశంతోటి అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, మున్సిపాలిటీలో మహిళ చైర్మన్, వైస్ చైర్మన్ మహిళా కౌన్సిలర్లు, ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో టీ క్యాంటీన్లు, అద్దె బస్సులు, అభివృద్ధి చెందేందుకు మధ్యాహ్న భోజనం ,స్వయం సహాయక సంఘాల ద్వారా ఏర్పాటు చేపించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల అప్పగించడం, వంటి కార్యక్రమాలతో మహిళలను ఆర్థికంగా ఎదుగుదలకు చేయూత ఇస్తున్నారని అన్నారు. 23 వార్డులలో నిరుపేద మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కౌన్సిలర్లు మట్ట ప్రసాద్, నసీమా షరీఫ్, చల్లగుండ్ల నరసింహారావు, రామారావు, సూర్య, మహిళలు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఉన్నారు.

# వీవోఏల సమ్మెకు భారతీయ జనతా పార్టీ మద్దతు

**చింతకాని మే 29ప్రజాజ్యోతి :**

చింతకాని మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట,తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీవోఏల దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యల పరిష్కారం కోరుతూ వీవోఏ వర్కర్లు గత పది రోజుల నుండి చింతకాని ఎంపీడీవో ఆఫీస్ ఎదుట సమ్మె చేయడం జరుగుతుంది.వారి సమ్మెకు మద్దతుగా చింతకాని భారతీయ జనతా పార్టీ నాయకులు సమ్మెలో పాల్గొన్నారు.బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కొండా గోపి మాట్లాడుతూ వీవోఏ ల డిమాండ్స్ మేరకు ప్రభుత్వం వెంటనే స్పందించి, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలికంగా ఉన్న వాళ్ళ సమస్యకు పరిష్కారం చేయాలని, వీవోఏ లకు కనీస జీతం 20వేల రూపాయలు ఇవ్వాలని, అర్హులైన వివో ఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని, సామాజిక ఆరోగ్య బీమా సౌకర్యం 20 లక్షలు వరకు కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, జీవో నెంబర్ 58వ



సవరణ చేసి వారికి న్యాయం చేయాలని వారు మాట్లాడారు. సరైన న్యాయం జరగకపోతే వీవోఏ ల తరుపున రాబోయే రోజులలో కలెక్టరేట్ ముట్టడి చేయడానికి భారతీయ జనతా పార్టీ తరపున మేము సిద్ధంగా సిద్ధంగా ఉన్నామని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోరిపల్లి శ్రీను, బుర్ర శ్రీను, ప్రధాన కార్యదర్శిలు గోద మంగయ్య, ఇమ్మడి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కొండా వెంకన్న, అంజన సిద్ధార్థ, వేముల ఎల్లయ్య, పామర్తి శ్రీను తదితరులు, పాల్గొన్నారు.

# కోదుమూరు -2 అంగన్వాడీ కేంద్రం నందు తల్లుల సమావేశం

– హాజరైన సీడీపీఓ సిహెచ్ కమలప్రియ

**చింతకాని మే29ప్రజాజ్యోతి ప్రతినిధి :**ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక లో భాగంగా కోదుమూరు -2 అంగన్వాడీ కేంద్రం నందు తల్లుల సమావేశం నిర్వహించారు. సీడీపీఓ శ్రీమతి సిహెచ్ కమలప్రియ హాజరై వారు మాట్లాడుతూ.మొదటి 1000 రోజుల పై అవగాహన, తల్లి పిల్లల పోషణ, పరిశుభ్రత, బాల్యారంభ అభివృద్ధి లో కుటుంబ సభ్యుల పాత్ర, అంగన్వాడీ కేంద్ర కార్యకలాపాలు గురించి వివరించారు. తల్లులు,పిల్లలకు పోషకాహారం పంపిణీ చేసి, గర్భిణీ గృహ సందర్శన చేశారు. ముఖ్య అతిథి గా ఉప సర్పంచ్ సిహెచ్ రాంబాబు హాజరై వారు మాట్లాడుతూ.. అంగన్వాడీ లో లభిస్తున్న పోషకాహారం, ప్రీస్కూల్ సేవలను వినియోగించుకోవలసిందిగా సూచించారు. హెల్త్ సూపర్వైజర్ శ్రీమతి రేచల్ రాణి ఇమ్యూనిసషన్, గర్భిణీలకు అందించే ఆరోగ్య సేవలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీమతి టి.విజయలక్ష్మి,ఏఎన్ఎం పద్మావతి, అంగన్వాడీ టీచర్ గౌసియా బేగం, ఆశాలు, వరమ్మ, రేణుక, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వరదల నివారణకు ముందస్తు చర్యలపై దృష్టి పెట్టండి పునరావాస కేంద్రాలను గుర్తించి సౌకర్యాల కల్పించండి

**నేలకొండపల్లి, మే 29 ప్రజా జ్యోతి:**

వరదల నివారణ చర్యలకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాలని నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డిజిస్టార్ మేనేజ్మెంట్ సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గతంలో విపత్తులను ఎదుర్కొనేందుకు మండల యంత్రాంగం విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. రానున్న వర్షాలు, వరదల వలన ఏ ఒక్కరికి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు ' తీసుకోవాలని సూచించారు. పాలేరు ఏటి పరివాహక ప్రాంతం లోని గ్రామాల ప్రజలను వరదల పై అవగాహన కల్పించాలని కోరారు. మండలం లోని బోదులబండ, పైనంపల్లి, కట్టుకాసారం, చెరువుమాధారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రాలనుఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలలో అన్ని సౌకర్యాలను కల్పించాలని సూచించారు. జూలై,



ఆగస్టు లో పాలేరు ఏటి ప్రాంతాల లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వరదల నివారణ కోసం పని చేయాలని సూచించారు. శిధిలావస్థలో ఉన్న ఇళ్ల ను గుర్తించి...ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం ప్రతిపాధనలు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, మండల విద్యాశాఖాధికారి చలపతిరావు, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఏఎస్సై కోటేశ్వరరావు, ఐకేపీ ఏపీయం సురేందర్, ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులపై వైద్య అధికారులకు అవగాహన శిక్షణ

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 29 ,(ప్రజాజ్యోతి)**

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారాం రాథోడ్ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలోని పి హెచ్ సి, యు పి హెచ్ , యుఎఫ్‌డబ్ల్యుసి వైద్య అధికారులకు వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధులపై అవగాహన, ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ముఖ్యంగా పోలియో ,మీజిల్స్ వ్యాధుల లక్షణాలు, అనుమానిత కేసులను గుర్తించే విధానం, వెంటనే చేపట్టాల్సిన విచారణ, నమూనాల సేకరణ, ఫాలోఅప్ చర్యలు, వ్యాధి నియంత్రణ చర్యలు, నివేదికల సమర్పణ విధానాలపై సమగ్రంగా వివరించారు. జిల్లాలో వ్యాక్సిన్ ద్వారా నివారించగల వ్యాధుల నిర్మూలన లక్ష్యాలను సాధించేందుకు ప్రతి వైద్య అధికారి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని, అనుమానిత కేసులను వెంటనే గుర్తించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్. ప్రతాప్, డా. రాకేష్, దినేష్, డా. హరీష్, జిల్లా పరిధిలోని అన్ని పి.హెచ్.సి, యూపీహెచ్సి , యు ఎఫ్ డబ్ల్యు సి లకు చెందిన వైద్య అధికారులు పాల్గొన్నారు.



# భగభగమంటున్న భానుడు

- కొన్ని జిల్లాలలో 45 నుంచి 46 డిగ్రీలకు చేరుకుంటున్న ఉష్ణోగ్రతలు
- పెరిగిన ఉష్ణోగ్రతలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రాష్ట్రం
- మండలంలో చలివేంద్రాలు మజ్జిగ ప్యాకెట్స్ ఏర్పాటు చేయాలి

**అశ్వాపురం, మే 28, ప్రజా జ్యోతి పత్రిక**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం మండలాలలో రోజు రోజుకి ఎండ ఉష్ణోగ్రతలు పెరగడంతో అతలాకుతులమవుతున్న మండల ప్రజలు వడగాలుల తీవ్రతకు పగటి ఉష్ణోగ్రతలు పిల్ లైన్ ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల మార్కును చేరుకుంటున్నాయి. దీనిపై ప్రజల ఆగ్రహానికి గురైయి వుతున్నారు... అయినా



ఇంతవరకు రెడ్ అలర్ట్ జారీచేయడం మినహా ప్రజలకు కావలసిన సదుపాయాలు గ్రామపంచాయతీ అయినా గాని రెవెన్యూ శాఖ గాని 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకుంటే మండలంలో గ్రామపంచాయతీ వారు మజ్జిగ ప్యాకెట్లు చల్లని నీరు ఏర్పాటు చేయాలి కానీ ఇప్పటికీ 40 నుంచి 50 డిగ్రీలకి మధ్య ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు పట్టించుకున్న దాఖలు లేకపాయే ఇప్పటికీ భద్రాద్రి కొత్తగూడెంలో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉందని రెడ్ అలర్ట్ ప్రకటించారు..ఎండ తీవ్రతను అధికారులు పట్టించుకోవట్లేదు అని ఆరోపణలు వస్తున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం కొన్ని కీలక ఆదేశాలను జారీ చేసింది. వాతావరణ సూచన మేరకు జిల్లా కలెక్టర్ 12 గంటల నుంచి నాలుగు గంటల వరకు ఎవరు బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. రైతు సమస్యల విషయానికొస్తే ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎండ తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారని అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించట్లేదని సోషల్ మీడియాలో నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగునీరు అందుబాటులో ఉంచాలని స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేశారు. ప్రజా ఆందోళన అత్యంత ఎండలు వడగాలులు ఉన్నప్పటికీ బయట పని చేసే కార్మికులకు గాని సామాన్య ప్రజలకు గాని తగిన చర్యలు మజ్జిగ ప్యాకెట్స్,చలివేంద్రాలు , అధికారులు ఏర్పాటు చేయడం లేదని వాపోతున్న మండల ప్రజలు. ఎండలు పెరుగుతున్న నేపథ్యం ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నాం మండల ప్రజలు...

# అధికారులు రారు.. తనిఖీలు చేయరు?

- హోటల్, రెస్టారెంట్లపై సివిల్ సప్లై అధికారులు ప్రేమ ఎందుకో!
- కనీసం కన్నెత్తి చూడని వైనం!
- విచ్చలవిడిగా డోమెస్టిక్ సిలిండర్ల వినియోగం
- కానరాని కమర్షియల్ సిలిండర్లు
- అధికారుల వైఖరికి తగ్గట్టుగా నిర్వాహకుల వైఖరి?
- డొమెస్టిక్ సిలిండర్లు హోటల్స్, రెస్టారెంట్స్ లకు ఎవరు సరఫరా చేస్తున్నారో!
- ఆకస్మిక తనిఖీలు చేస్తే వందల డొమెస్టిక్ సిలిండర్లు దర్శనం?
- జిల్లా అధికారులు నిఘా తప్పనిసరి
- అదిశగా అధికారులు ముందుకు సాగేనా?









**ఇల్లందు, మే 29, ప్రజాజ్యోతి:**

సాధారణంగా వ్యాపారం చేసేవారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. అదేవిధంగా ప్రభుత్వ అధికారులు సైతం అదే నిబంధనలతో విధులను నిర్వర్తించవలసి ఉంటుందనేది వాస్తవం. కానీ ఇల్లందులో హోటల్స్, రెస్టారెంట్స్ ల నిర్వాహకులు ఇష్టానుసారంగా నిబంధనలకు తూట్లు పొడుస్తూ కమర్షియల్ సిలిండర్లకు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్నప్పటికీ సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు కనిపించడం లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇల్లందులో హోటళ్లు, రెస్టారెంట్లలో నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల వినియోగం జరుగుతోందన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. సాధారణంగా గృహ వినియోగం కోసం ప్రభుత్వం సబ్సిడీతో అందించే డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ పట్టణంలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగం యథేచ్ఛగా సాగుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం కమర్షియల్ సిలిండర్లను వినియోగించాల్సిన చోట డొమెస్టిక్ సిలిండర్లు దర్శనమివ్వడం వెనుక భారీ అక్రమ వ్యవస్థ పనిచేస్తుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనలు హోటళ్లు, రెస్టారెంట్‌లకు వర్తించవా?**

ఇటీవల కాలంలో గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకసారి డొమెస్టిక్ సిలిండర్ పొందిన తర్వాత మరో సిలిండర్ కోసం సుమారు 45 రోజుల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సాధారణ కుటుంబాలే ఈ పరిస్థితిలో ఇబ్బందులు పడుతుంటే, రోజుకు వందలాది మంది వినియోగదారులకు ఆహారం తయారు చేసే హోటళ్లు, రెస్టారెంట్ల అవసరాలు ఎలా తీరుతున్నాయన్న ప్రశ్న తలెత్తుతుంది. సగటున ఒక హోటల్, రెస్టారెంట్ కు ఒక్కో డొమెస్టిక్ సిలిండర్ రెండు నుంచి మూడు రోజులు మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన 45 రోజుల వ్యవధిలో కనీసం 15 నుంచి 20 సిలిండర్లు అవసరమవుతాయి. అయితే కమర్షియల్ సిలిండర్ల వినియోగం పెద్దగా కనిపించకపోవడం, డొమెస్టిక్ సిలిండర్ల వినియోగంపై అనుమానాలకు మరింత బలం చేకూరుస్తుంది. హోటల్స్, రెస్టారెంట్ లకు ఇబ్బడి ముబ్బడిగా డొమెస్టిక్ సిలిండర్‌లో ఎలా వస్తున్నాయో తెలియాల్సి ఉంది.

**సివిల్ సప్లై అధికారుల మౌనం వెనుక కారణాలేంటి?**

హోటళ్లు, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్ల వినియోగంపై ఎన్నో ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత సివిల్ సప్లై అధికారులు ఇప్పటివరకు పెద్దగా స్పందించిన దాఖలాలు కనిపించడం లేదు. మచ్చుకైనా ఒక్క హోటల్‌లో తనిఖీ చేసి డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న ఘటన గానీ, కేసులు నమోదు చేసిన సంఘటన గానీ ప్రజలకు తెలియరాలేదని స్థానికులు పేర్కొంటున్నారు.అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొందరు నిర్వాహకులపై అధికారులు ప్రత్యేక సానుభూతి చూపుతున్నారనే ఆరోపణలు కూడా ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. అధికారులు హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వాహకులకు ముందస్తు సమాచారం లేకుండా ఏకకాలంలో ఆకస్మిక దాడులు చేస్తే వందల డొమెస్టిక్ సిలిండర్లు బయటపడతాయనేది మాత్రం వాస్తవమని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**డొమెస్టిక్ సిలిండర్లు ఎవరు సరఫరా చేస్తున్నారు?**

హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగిస్తున్న డొమెస్టిక్ సిలిండర్లు ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటిని ఎవరు సరఫరా చేస్తున్నారు? అన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. సాధారణ వినియోగదారులకు 45 రోజుల నిబంధన అమలవుతుంటే, వాణిజ్య సంస్థలకు మాత్రం అవసరమైనన్ని సిలిండర్లు ఎలా అందుతున్నాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

కొంతమంది గ్యాస్ ఏజెన్సీల ప్రమేయం ఉండొచ్చని భావిస్తుండగా, మరికొందరు మధ్యవర్తుల ద్వారా అక్రమ సరఫరా జరుగుతుందనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కోణంలో సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తాం: శివ కుమార్, డీటి, పౌర సరఫరాల శాఖ, ఇల్లందు**

ఇల్లందులోని హోటల్స్, రెస్టారెంట్లలో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తున్న విషయంపై ఆకస్మికంగా తనిఖీలు చేస్తాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హోటల్స్, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్లను వినియోగించాలి. డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. హోటల్స్, రెస్టారెంట్స్ నిర్వాహకులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వినియోగించాలి.

## దాడి చేసిన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్: మనూర్ మండల పరిధిలోని అతిమ్యాల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మహేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత జర్నలిస్టు ఫోరం నాయకులు సంగారెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వార్త సేకరణకు వెళ్లిన రిపోర్టర్ రాములుపై మార్చి 17న



ఉపాధ్యాయుడు దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనలో సహకరించిన గ్రామస్థులపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.శుక్రవారం సంగారెడ్డి ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ పరితోష్ పంకజ్‌కు ఉమ్మడి మెదక్ జిల్లా దళిత జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు రాపాక విజయరాజు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులపై దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట తెలంగాణ ఆల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దత్తు రెడ్డి, జర్నలిస్టు సాయిలు ఉన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ దోషులను వదలం

మొదటిపేజీ తరువాయి..

వారెవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించిన అన్ని కేసులను ఫాస్ట్-ట్రాక్ కోర్టులలో విచారిస్తామని.. తద్వారా నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూస్తామని పేర్కొన్నారు.నీట్ యూజీ పరీక్ష నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫెయిల్ అయ్యిందన్నారు. శుక్రవారం కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఓ నేషనల్ మీడియా టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ..నీట్ యూజీ పేపర్ లీక్ అయిందని అంగీకరిస్తున్నాను. ఎన్‌టీఏ విఫలమైంది. ఈ



విషయాన్ని నేను ఒప్పుకుంటున్నానని పేర్కొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష సమగ్రతను దెబ్బతీస్తున్న విద్యా మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవడానికి మోదీ సర్కార్ కట్టుబడి ఉందని అన్నారు. పేపర్ లీకేజీలో పాలుపంచుకున్న వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంటుందని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్ష ఫలితాల్లో నెలకొన్న గందరగోళంపైన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. సీబీఎస్ఈ మూల్యాంకన వ్యవస్థలో ఓఎస్ఎంకు సంబంధించిన సాంకేతిక సమస్యలతో సహా పలు సమస్యలు ఉన్నాయని అంగీకరించిన ఆయన.. వాటిని ప్రస్తుతం ఐఐటీ నిపుణుల సహాయంతో పరిష్కరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ ఉపయోగించే పేమెంట్ గేట్‌వే విదేశీ హ్యాకర్ల నుంచి జరిగిన సైబర్‌దాడికి గురైందని హాట్ కామెంట్స్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి, వ్యవస్థను బలోపేతం చేయడంలో సీబీఐ సైబర్ బృందం సీబీఎస్ఈకి సహకరిస్తోందని తెలిపారు.11 లక్షలకు పైగా విద్యార్థులు ఇప్పటికే తమ జవాబు పత్రాల కాపీలను పొందగా.. నాలుగు లక్షలకు పైగా అభ్యర్థులు పునఃమూల్యాంకనం కోసం దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ప్రతి ఫిర్యాదును పరిష్కరిస్తామని.. ప్రక్రియను మెరుగుపరచడానికి అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని విద్యార్థులకు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు.

# ఫరీద్‌పేట్‌లో సర్పంచ్‌పై గ్రామస్థుల తిరుగుబాటు

- 100 మంది గ్రామస్థుల ఫిర్యాదు
- మాజీ సర్పంచ్ హయాంలో చేసిన పనులకే మళ్లీ బిల్లుల ఆరోపణలు
- పోలీసు బందోబస్తు మధ్య జాయింట్ ఎంక్వైరీ
- సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య వాగ్వాదం

కామారెడ్డి ప్రతినిధి, మే 29(ప్రజాజ్యోతి): కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం, డూప్లికేట్ బిల్లులు, చేయని పనులకు చెల్లింపులు, ప్రైవేట్ ఆస్తులకు ప్రజా ధనం మళ్లింపు ఆరోపణలపై శుక్రవారం నిర్వహించిన జాయింట్ ఎంక్వైరీ గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో పోలీసు బందోబస్తు నడుమ విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ ఉత్తర్వులతో జిల్లా ఆడిట్ అధికారి, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిల్లా పంచాయతీ అధికారి, పాల్వంచ, మాచారెడ్డి మండలాల ఎంపీడీఓలు గ్రామంలో పర్యటించి రికార్డులు పరిశీలించడంతో పాటు సంబంధిత పనుల స్థలాలను సందర్శించారు. ఈ సందర్భంగా దాదాపు 100 మంది గ్రామస్థులు సంతకాలు చేసిన వినతిపత్రాన్ని విచారణాధికారులకు సమర్పించారు. మాజీ సర్పంచ్ ఆశం భాగ్యమ్మ హయాంలో గ్రామపంచాయతీ నిధులతో పూర్తయిన డ్రైనేజీలు, సీసీ రోడ్లు, ఇతర



అభివృద్ధి పనులను మళ్లీ కొత్త పనులుగా చూపించి సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి బిల్లులు డ్రా చేసినట్లు ఆరోపించారు. గ్రామ ప్రజల తరపున సమర్పించిన ఫిర్యాదులో రూ.9,61,937 విలువైన పనులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విచారణ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను అధికారులకు వివరించారు. కొన్ని సందర్భాల్లో సర్పంచ్ జీడిపల్లి నర్సింహారెడ్డి, ఫిర్యాదుదారుడు మధుసుధాన్ రెడ్డిని తన ముందుకు తీసుకొని వచ్చిన తర్వాతే విచారణ చేయాలని చెప్పడంతో వాగ్వాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అధికారులు జోక్యం చేసుకుని విచారణను కొనసాగించారు. మరోవైపు వార్డు సభ్యులు కూడా ప్రత్యేకంగా వినతిపత్రం సమర్పించి గ్రామపంచాయతీ నిధుల వినియోగం, తీర్మానాలు, రికార్డుల నిర్వహణ, వార్డు సభ్యులకు సమాచారం ఇవ్వకపోవడం వంటి అంశాలపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా గ్రామస్థులు “నీ సొంత అల్లుడే నువ్వు చేసిన అవినీతిని బయటకు తీసుకొస్తున్నాడు” అంటూ చేసిన వ్యాఖ్య అక్కడ చర్చనీయాంశంగా మారింది. దీంతో కొంతసేపు ఉద్రిక్త



వాతావరణం నెలకొంది. విచారణ అనంతరం అధికారులు మాట్లాడుతూ, ఫిర్యాదుదారులు, గ్రామస్థులు, వార్డు సభ్యులు, సంబంధిత వ్యక్తుల వాదనలు విన్నామని, సంబంధిత రికార్డులను పరిశీలించామని, పనుల స్థలాలను సందర్శించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించామని తెలిపారు. పూర్తి స్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి తదుపరి చర్యల కోసం పంపనున్నట్లు వెల్లడించారు. గ్రామస్థులు, వార్డు సభ్యులు మాట్లాడుతూ, విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ప్రజాప్రతినిధు లు, కాంట్రాక్టర్లు, బాధ్యులైన అధికారులపై క్రిమినల్, పరిపాలనా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది?

మొదటిపేజీ తరువాయి..

పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది.

నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

## సిద్దరామయ్య రాజీనామాకు ఆమోదం

మొదటిపేజీ తరువాయి..

ప్రశ్నలకు సిద్ధరామయ్య క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. శాసనసభ పక్షం, పార్టీ హైకమాండ్ కలిసి కొత్త నాయకుణ్ని ప్రకటిస్తాయని స్పష్టం చేశారు. తనకు రాజ్యసభ సీటు ఆఫర్ వచ్చినట్లు జరుగుతున్న ప్రచారంపై మాత్రం ఆయన స్పందించలేదు. ఆ



ప్రశ్నకు సమాధానం దాటవేస్తూ నేరుగా ముందుకు సాగిపోయారు. డీకే శివకుమార్ కూడా అధిష్ఠానంతో చర్చల తర్వాతే తదుపరి నిర్ణయాలు ఉంటాయని మీడియాకు తెలిపారు.మరోవైపు అధికారికంగా ప్రకటించకపోయిన ప్పటికీ.. డీకే. శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు దాదాపు మార్గం సుగమమైంది. మంత్రివర్గ కూర్పు, సిద్దరామయ్య డిమాండ్లపైనే అధిష్ఠానంతో ఆయన చర్చిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇవి కొలిక్కి వస్తే ఆయన ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. జూన్ 1 లేదా 4వ తేదీన ఆయన ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందంటూ పార్టీల వర్గాల ద్వారా తెలుస్తోంది.

కాగా.. డీకే శివకుమార్ బాధ్యతలు స్వీకరించడానికి ముందే... పార్టీలో ఆధిపత్యం కోసం అలాగే, రేపు ఆయన సీఎం అయ్యాక పాలనపరంగానూ తమ పట్టు నిలుపుకునేందుకు సిద్ధరామయ్య ప్రయత్నాలు చేస్తున్నట్లుగా తెలుస్తోంది. నిన్న రాజీనామా చేసిన అనంతరం సిద్దరామయ్య తన కుమారుడితో కలిసి ఢిల్లీకి చేరుకున్నారు. ఈరోజు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ముఖ్య నాయకుడు రాహుల్ గాంధీని కలిసి తన కుమారుడికి కీలకమైన శాఖలు అప్పగించాలని కోరారు. తాజాగా ఆయన అధిష్ఠానం ముందు మరో కీలక ప్రతిపాదన ఉంచారు. కర్ణాటక ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ మధ్య సమన్వయం చేయడానికి ఒక కోఆర్డినేషన్ కమిటీని వేయాలని, తనకు చైర్మన్ బాధ్యతలను అప్పగించాలని కాంగ్రెస్ పెద్దల ముందుకు ప్రతిపాదన తీసుకువెళ్లారు. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయ కమిటీ ఉంటే బాగుంటుందని సూచించారు. 2018లో కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం హయాంలో సిద్దరామయ్య సమన్వయ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించారు. డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో, ఇప్పుడు మరోసారి ఈ ప్రతిపాదనను తెరమీదకు తీసుకువచ్చారు. అయితే పార్టీకి సొంతగా మెజారిటీ ఉన్న నేపథ్యంలో సమన్వయ కమిటీ అవసరం లేదని అధిష్ఠానం చెప్పినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## తెలంగాణలో అంచనాను మించి ధాన్యం ఉత్పత్తి

మొదటిపేజీ తరువాయి..

ఉన్నాయని తెలిపారు. 2 లక్షల మంది సిబ్బంది సేకరణలో పాల్గొంటున్నారని చెప్పారు. సేకరణ కేంద్రాలకు 20.86 కోట్ల గన్నీ బ్యాగులు పంపామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి రూ.11,050 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేశామని వివరించారు. ‘ధాన్యం సేకరణకు బిహార్, బెంగాల్ కార్మికులపై ఆధారపడి ఉన్నాం. బెంగాల్ ఎన్నికలకు కార్మికులు స్వస్థలాలకు వెళ్లి రావడం ఆలస్యమైంది. మద్దతు ధర కోసం మా ప్రభుత్వం రూ.49 వేల కోట్లు వెచ్చించగా.. గత ప్రభుత్వం రూ.10వేల కోట్లే ఇచ్చింది. ఈ విషయంలో ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం పండింది.. ఏ రాష్ట్రంలో జరగని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు జరుగతున్నాయని స్పష్టం చేశారు. ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ గా ఉందన్నారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కనీస మద్దతు ధరకే అన్ని రకాల ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎంఎస్ పీ ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 16వేల కోట్ల రూపాయలు ఖర్చు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. రాష్ట్రంలో 143 లక్షల టన్నుల ధాన్యం పండితే.. ఇప్పటివరకు 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ వరకు మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.

యాసంగిలో రాష్ట్ర ప్రభుత్వం 73 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసింది..అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వం కేవలం 5 లక్షల ధాన్యమే కొనుగోలు చేస్తామని చెబుతోంది.. ఏటా తెలంగాణ నుంచి ధాన్యం కొనుగోళ్లను తగ్గిస్తూ వస్తోంది. ధాన్యం కొనుగోళ్లు పెంచాలని కేంద్రాన్ని సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినా పట్టించుకోవడం లేదు. బీజేపోళ్లు ధర్నా చేసుడు కాదు.. ఢిల్లీకి వెళ్లి వడ్లను కొనాలను కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లకు 16వేల కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న చివరి గింజ వరకు ధాన్యం సేకరణ జరుగుతుందన్నారు. ధాన్యం సేకరణలో 2వేల మిల్లులు పనిచేస్తున్నాయన్నారు. ధాన్యం తరలించేందుకు 13వేల వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో



హమాలీల కొరత ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ ధాన్యం కొనుగోలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ ఎస్ హయాంలో ఏడాదికి 15వేల ఇస్తే కాంగ్రెస్ హయాంలో 49వేల కోట్లు ఇస్తున్నామన్నా రు మంత్రి.. తెలంగాణలో 60 లక్షల టన్నుల ధాన్యం కొంంటే.. ఏపీలో 24 లక్షలే కొన్నరని పోల్చి చెప్పారు. ఇప్పటివరకు రూ.11వేల 50కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం.. రెండున్నరేళ్లలో రూ.36వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. వడ్లను కొన్న 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామన్నారు. చివరి గింజ కొనేవరకు కొనుగోలు కేంద్రాలు పనిచేస్తాయని, ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన 10వేల 214 టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967